54953
కథా నిలయం

ప్రజాశక్తి ఆదివారం అనుబంధం

ఆగస్ట్ 10, 2008

బిలియన్ డాలర్ బేబీస్

హ్యాపీ బర్త్‌డే

(2008 ఆగస్టు 10 నుంచి- 2008 ఆగస్టు16 వరకు)

ఎల్. నవనీత
ఆగస్టు-9
మంజుల-నర్సింగ్‌రావు
పద్మారావునగర్-సికింద్రాబాద్

కె. షరీఫ్
2సం॥, ఆగస్టు-16
ఖాజబీ-రుక్మొద్దీన్
పాణ్యం-కర్నూలు

ఎం. సౌమ్య
10సం॥, ఆగస్టు-11
కరుణశ్రీ-భాస్కర్
నందీశ్వర కాలనీ-నల్లగొండ

శాంతి-దీపిక
3సం॥, ఆగస్టు-2005
సీత-గురుమూర్తి
మరిపల్లి-విజయనగరం

ఇ. రేవతి(వెన్నెల)
2సం॥, ఆగస్టు-2006
విజయలక్ష్మి-నగేష్
ఆత్మకూర్-నల్లగొండ

బి. తేజశ్రీసత్య
5సం॥, ఆగస్టు-2003
లలిత-వెంకటేశ్వరరావు
అమలాపురం-తూ॥గో

ఇ. అంజుల
ఆగస్టు
భారతి-రామచంద్ర
అనంతపురం

మేఘన
2సం॥, ఆగస్టు-2006
మైత్రి-రమణ
కొండపల్లి-కృష్ణా

సిహెచ్.నవ్య
10సం॥, ఆగస్టు-15
వెంకటరమణ-ఎల్లయ్య
పివిరెడ్డిగూడెం-ఖమ్మం

జె. గౌతమి శ్రీనిధి-శ్రీహర్ష
ఆగస్టు-15
లక్ష్మి-శ్రీనివాసరావు
విజయవాడ-కృష్ణా

పి. లక్ష్మీహరి చందన
2సం॥, ఆగస్టు-15
సత్యలక్ష్మి-గోపీకృష్ణ
జిన్నూరు-ప॥గో

యమ్. రాఖీశ్రీ
2సం॥, ఆగస్టు-2006
రజిత-వెంకటయ్య
కొత్త-మ॥నగర్



మార్పుని అధ్యయనం చేయాలి

మన అతిథి

పేరు : అరిబండి ప్రసాద రావు

తల్లిదండ్రులు : అన్నపూర్ణ, లక్ష్మీనారాయణ

స్వగ్రామం : పెంచికల్ దిన్నె గ్రామం, నేరేడుచర్ల మండలం, నల్గొండ జిల్లా.

పుట్టిన తేది : **30-10-1942**

విద్యార్హతలు : ఎమ్మెస్సీ (అగ్రికల్చర్)- ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, హైదరాబాద్), పి.హెచ్.డి (భారత వ్యవసాయ పరిశోధనా సంస్థ, న్యూ ఢిల్లీ)

నిర్వహించిన బాధ్యతలు : ఎన్.జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో (ప్రొఫెసర్-భూమి, వ్యవసాయ,రసాయనిక విభాగం), ఇండియన్ సొసైటీ ఆఫ్ సాయిల్ సైన్సెస్ హైదరాబాద్ ఛాప్టర్ కార్యదర్శి, ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం కార్యదర్శి, 'రైతు వాణి' ఎడిటోరియల్ బోర్డు సభ్యులు, వ్యవసాయ సంక్షోభంపై జస్టిస్ పి.ఎ చౌదరి కమీషన్‌లో సాంకేతిక సభ్యునిగా బాధ్యతలు. అరిబండి బాల సాహిత్యం మేనేజింగ్ ట్రస్టీ, 'మామయ్య' బాలల మాస పత్రిక ఎడిటర్.

రచనలు : అరిబండి బాల సాహిత్యం ట్రస్టు నుండి ఆరు పుస్తకాలు, ఆంధ్రప్రదేశ్ నేలల గరిష్ఠ ఉత్పాదక శక్తికి అవసరమైన సాంకేతిక విజ్ఞానం, ఆంధ్రప్రదేశ్ నేలల మోనోగ్రాఫ్ పుస్తకానికి ఎడిటోరియల్ మెంబర్‌గా పనిచేశారు, వ్యవసాయ సంక్షోభంపై పలు నివేదికలు, వ్యాసాలు రాశారు.

జీవిత లక్ష్యం : స్వేచ్ఛా వాతావరణంలో పిల్లలు ఎదిగేందుకు కృషి చేయడం, ఆ లక్ష్యంగా ఉన్న పిల్లల కార్యక్రమాల్ని ప్రోత్సహించడం.

ఇష్టపడేది : తోటి మనిషి ఇబ్బందుల్లో ఉన్నప్పుడు వీలైన సహాయం చేసే ప్రతి వ్యక్తిని

ఇష్టపడనిది : అతిగా గొప్పలు చెప్పుకోవడం.

ప్రభావం చూపిన వ్యక్తులు : నాన్న- అరిబండి లక్ష్మీ నారాయణ, డాక్టర్ ఎమ్మెస్ స్వామి నాథన్, పుచ్చలపల్లి సుందరయ్య, నర్రా రాఘవరెడ్డి, బోడేపూడి వెంకటేశ్వర రావు, కొరటాల సత్యనారాయణ.

దేశం సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే వ్యవసాయ రంగం పటిష్టంగా ఉండాలి. చిన్న, సన్నకారు కమతాలు అభివృద్ధి చెందినప్పుడే మన దేశం అభివృద్ధి చెందుతుంది. ప్రభుత్వ ప్రణాళికలు ఈ లక్ష్యంగా సాగాలి. మానవతా విలువల మూర్తులుగా బాలలు పెరగాలి. బాలల అభివృద్ధికి సమాజం దోహద పడాలి. ప్రభుత్వం ఈ బాధ్యతను సంపూర్ణంగా నిర్వహించాలి. తెలుగులో బాల సాహిత్యం ఊహాలోకంలో విహరించకుండా వాస్తవ ప్రపంచం ఆధారంగా రచనలు సాగాలి. కవిత్వం , కథల్లో రచయితల అనుభవ సారం క్లుప్తంగా ప్రతిబింబిస్తే బావుంటుంది. సమాజంలో భాగంగా వ్యక్తిత్వ వికాసం జరగాలనే కోణంలో కాకుండా 'సమాజం ఏటైనా పోనీ, నావరకు నేను ఎదిగితే చాలు' అనే ధోరణితో నేడు వ్యక్తిత్వవికాస సాహిత్యం వెలువడుతోంది. ఈ పద్ధతి మారాలి. సమాజంలో వస్తున్న నూతన మార్పుల్ని అధ్యయనం చేసి సమాజాభివృద్ధికి దోహదపడే ధోరణలను స్వీకరించాలి.

ఈ సంచికలో....

టపా	...	2
ఆరోగ్యం	...	3
సీరియల్	...	8
సినిమా	...	10
మనసా... తెలుసా	...	11
బాలనేస్తాలు	...	12
అట్టమీది కథ	...	14

ఇంకా...

మంచిపుస్తకం ...6

మాటల బాట
భాష బావుటా

చూద్దామా ... 4

వన్యప్రాణులు...ప్రకృతి సౌందర్యాల కలబోత
కాజిరంగ

రుచి	...	17
లాహిరి... లాహిరి	...	20
విజ్ఞాన వీచిక	...	22
కొత్త పుస్తకాలు	...	24

కథ 18
లాకౌట్



అట్టమీది కథ సూపర్

జులై, 27న స్నేహలో మన అతిథిగా వచ్చిన డాక్టర్ ఎం.పి పరమేశ్వరన్ దేశ అభివృద్ధిగురించి చక్కటి విశ్లేషణ చేశారు. వనరులన్నీ అవసరాల కోసమే కానీ, విలాసాలకు కాదని, ఈ విషయాన్ని మన సమాజం ఎప్పుడు గుర్తిస్తుందో అప్పుడే దేశాభివృద్ధి జరుగుతుంది అని ఖచ్చితంగా చెప్పారు. ఆయన అభిరుచులు, అనుభవాలు చాలా బాగున్నాయి. ఓ మంచి పుస్తకంలో శ్రీశ్రీ సిప్రాలి, మహాకవి హాస్యకేళి అంటూ ఆయనలోని కొంటె కోణాలను మరోసారి గుర్తు చేసుకొనే అవకాశం కలిగింది. పుస్తక సంపాదకుడు చలసాని ప్రసాద్ నిజంగా అభినందనీయుడు. కొంటె కోణాలను వెతికి ఓ ప్రత్యేకమైన శైలిలో మరో పుస్తకానికి ప్రాణం పోయడం చెప్పుకో దగ్గ విశేషం. సంగీత వనంలో రఫీ జ్ఞాపకాలు అంటూ అట్టమీది కథలో ఈ వారం, సంగీతపు జల్లు కురిసింది. రఫీ మొట్ట మొదటి సారిగా పాడింది ఎక్కడ? ఏ విధంగా పాపులర్ అయ్యాడు?... చాలా చక్కగా ఆకర్షణీయమైన రీతిలో కళ్ళకు కట్టినట్లు వర్ణించారు. పురికో ఆలోచన, జిహ్వకో రుచిలా, రకరకాల ఇష్టాయిష్టాలు సినీ సంగీతంలోనూ వున్నాయి. రఫీని వరించిన పురస్కారాలు తెలుసుకోగలిగాం. రఫీ ఫొటోలు చాలా బాగున్నాయి. అట్టమీది కథలను సూపర్‌గా ప్రచురిస్తున్నారు. విజ్ఞాన వీచిక ప్రచురిస్తున్న విధానం హైలెట్. ప్రత్యామ్నాయ ఇంధనాలకు పెరుగుతున్న గిరాకీ అంటూ విజ్ఞాన వీచిక ద్వారా మీరు అందిస్తున్న విజ్ఞాన ధనం చెప్పలేనంత. సైన్స్‌కి సంబంధించిన వాస్తవాలను మా కళ్ళ ముందుంచి విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దుతున్న రచయిత ఎస్. వెంకట్రావుగారికి నా నమస్సులు.

కర్రా వరప్రసాద్,
యలమర్రు, కంఠ్రిక, కృష్ణాజిల్లా.

అతిథి మాటతో ఏకీభవిస్తున్నాం

సంగీతవనంలో రఫీ జ్ఞాపకాలు హృద్యంగా వున్నాయి. 'విరాగి' కథ బావుంది. లాహిరి లాహిరిలో శీర్షిక నచ్చుతోంది. 'విజ్ఞానవీచిక' శాస్త్రీయాంశాలను అవగాహన కలిగిస్తూ ఆకట్టుకుంటున్నది. 'నవ్వుల పోటీ', 'హైటెక్కు పంది' విభిన్నంగా ఉన్నాయి. 'ఆరోగ్యం' శీర్షికలో ప్రతీ వారం.... అక్షరలక్షలు చేసే, విలువైన సంగతులను తెలుసుకునే సదవకాశాన్ని కలిగిస్తోంది. 'చూద్దామా' శీర్షిక ద్వారా, కొత్త ప్రదేశాలను ఎన్నింటినో దర్శించుకోగలుతున్నాం. 'ఓ మంచి పుస్తకం' ద్వారా శ్రీశ్రీ గారి సిప్రాలి పరిచయభాగ్యం కలిగింది. వున్న వనరులన్నీ, అవసరాల కోసమే కాని విలాసాల కోసం కాదన్న నగ్న సత్యాన్ని వెలిబుచ్చిన మన అతిథి డా॥ ఎం.పి. పరమేశ్వరన్ గారితో ఏకీభవిస్తున్నాం.

నేమాన సుభాష్ చంద్రబోస్,
ఇలిసిపురం, శ్రీకాకుళం.

సంగీతవనంలో పారిజాత పరిమళం

నేపథ్యగానం అంటే తెలియని రోజుల్లో నటులకు గీతాలలో గానం ఎరువిచ్చి ఎందరో ప్రఖ్యాత నటులకు తమ పెదాల నుండి అలవోకగా ఆలపించిన అజరామర గీతాలతో తెరవెనుక నుండి ఉనికిని కాపాడుకుంటూ అసలు సినిమా విజయానికి నేపథ్యగానం కీలకంగా చేసిన మహోన్నత గాయకులలో ఉత్తర భారతంలో మహమ్మద్ రఫీ. దక్షిణాన ఘంటసాల గారంటే అతిశయోక్తి కాదు. ఆస్వాదించే రసజ్ఞులున్నంత కాలం వీరు జీవించే ఉంటారు. 1944 నుండి 80 వరకు రఫీ సమగ్ర విశేషాలతో పాటు ఫిలింపేర్ జాతీయ పురస్కారాలు, బినాకా గీత్‌మాల వంటి గీతస్మృతులతో పాటు ఫిలింఫేర్ జాతీయ పురస్కారాలతో సంగీత వనంలో రఫీ జ్ఞాపకాలు మళ్ళీ మళ్ళీ చదివించింది. అయితే రఫీ తెలుగులో భలే తమ్ముడు, ఆరాధన, తల్లా-పెళ్ళామా? వంటి చిత్రాలలోను అద్వితీయంగా పాడి తెలుగు ప్రేక్షకులకూ సుపరిచితులూ! వాటితో పాటు తెలుగు ప్రస్థానాన్ని వివరించి ఉంటే బాగుండేది. ఏమైనా సంగీతవనంలో పారిజాత పరిమళాన్ని ఆస్వాదించాం.

యర్రమోతు ధర్మరాజు, ధవళేశ్వరం,
తూర్పుగోదావరి జిల్లా.

క్యాన్సర్ గురించి తెలుసుకున్నాం

ఈ వారం అట్టమీది కథ సంగీత వనంలో రఫీ జ్ఞాపకాలను ఆనందింపజేశాయి. రఫీ సంగీత మధురమైన పాటలను ఇప్పటికి మరువలేము. గిన్నిస్ బుక్ స్థాయిలో ప్రజల ఆదరణ పొంది... అభిమానుల మనస్సులో స్థిరపడి పోయారు. ఇంత చక్కని జ్ఞాపకాల్ని పరిచయం చేసిన జె.పి. వైద్యకు కృతజ్ఞతలు. ఆరోగ్యం ద్వారా ఎముకల్లో క్యాన్సర్ గురించి తెలుసుకోగలిగాం. తీసుకోవలసిన జాగ్రత్తలు, విషయాలు డాక్టర్ గారు చక్కగా తెలిపారు. 'చూద్దామా' శీర్షికలో దాతియాలో పవిత్రమైన జైనుల దేవాలయాల గురించి అక్కడ ఉన్న ప్రదేశాలను గురించి... విగ్రహాల గోపురశిఖరం... జైన మందిరాల దగ్గర, ముస్లింలకు మసీదు కూడా ఉండడం గమనార్హం. నవ్వు లేనిదే మనిషి లేదు. బతకడం కష్టం, నవ్వుతూ నవ్విస్తూ ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలని కోరుకుంటున్నాం.

అనుపోజు సత్యనాగరాజు,
రాజీవ్‌నగర్ కాలనీ, విజయనగరం.

'సిప్రాలి'కి ధన్యవాదాలు

మహాకవి శ్రీశ్రీ సిప్రాలి చలసాని కూర్పు పుస్తక పరిచయం చాలా బాగుంది. కోట్ల మంది ప్రజల గుండెల్లో నిలిచిన ప్రజా కవి శ్రీశ్రీ ఎంతగా మాట్లాడుకున్నా ఎంత రాసినా చదివినా తరగదు. తెలుగు సాహిత్య సముద్రుడు శ్రీశ్రీ. మంచి పుస్తకాన్ని పరిచయం చేసినందుకు ధన్యవాదాలు. సంగీతవనంలో రఫీ జ్ఞాపకాలు కవర్ స్టోరీ బాగుంది. సంగీత దునియాలో చరిత్ర సృష్టించిన విషయాలు తెలిశాయి. ఆరోగ్యం శీర్షికలో ఎముకల క్యాన్సర్ వస్తే వ్యాసం విజ్ఞానదాయకంగా వుంది.



టి. శ్రీరామమూర్తి, గాజువాక,
విశాఖ.

మంచి మాట

వనరులు విలాసాలకు కాదన్న పరమేశ్వరన్ మాట మంచి మాట. దాతియా కొండమీద కోట, విశేషాలు బాగున్నాయి. శ్రీశ్రీ సిప్రాలి చెబుతారా? విప్లవకవి! కాకరకాయ పులుసు బాగుంటుంది. రఫీ సంగీత జాగ్రఫీ, ఆయన విశేషాలు సమగ్రంగా ఉన్నాయి. ఎదుట వాళ్ళకు ధైర్యం చెప్పే విరాగి కథ బాగుంది. మనం పాత సినిమా పిచ్చోళ్ళం.

వాస్తు రామచంద్ర,
రాంజీనగర్,
నెల్లూరు.

వీరి వీరి గుమ్మడి పండు

వీరి పేరేమి?

ఈ ఫొటో ఓ బాలీవుడ్ నటిది. జవాబు తెలియాలంటే 21వ పేజీ చూడండి.

ఆధునిక వైద్యం వుండగ... పిల్లలు లేరని దిగులేల...!



డాక్టర్ పద్మజా దివాకర్,
నవ్యనర్సింగ్ హోం సంతాన సాఫల్య కేంద్రం,
భువనగిరి, నల్గొండ జిల్లా.

"మనదేశంలో ప్రతి పది జంటలలో ఒకరికి సంతానం కలగడం లేదనేది వాస్తవం. పెరిగిపోతున్న కాలుష్యం... పోటీ ప్రపంచపు ఒత్తిడి, వయస్సు దాటని పెళ్లిళ్లు, మేనరికపు సంబంధాలు వంటివి ఈ సమస్యకు మరింత ఊపిరిపోస్తున్నాయి. అయితే అసలు ఆ సమస్యకు కారణాలేంటి? ప్రస్తుతం అందుబాటులో వున్న ఆధునిక వైద్యవిధానం ఏంటి? ఈ వారం చెప్పుకుందాం."

సంతాన సాఫల్యతా చికిత్స విధానాలు పలు అంతర్జాతీయ వైద్య సంస్థల కృషి ఫలితంగా మానవాళికి అందుబాటులో వచ్చాయి. 30 ఏళ్ల క్రితం మొట్టమొదటి టెస్ట్‌ట్యూబ్ బేబి (లూసీ బ్రౌన్) పుట్టిన నాటికి, నేటికి ఈ శాస్త్ర విజ్ఞానం ఎంతో అభివృద్ధి సాధించింది. వీర్య కణాలు అతి తక్కువగా ఉన్న పురుషులకు, గర్భాశయ, అండాశయ సంబంధిత పలు సమస్యలున్న స్త్రీలకు కూడా సంతానం కలిగే అవకాశాలున్నాయి.

సంతానలేమికి కారణాలు

స్త్రీలలో అండాశయ, గర్భాశయ లోపాలు, రుతుక్రమ దోషాలు, అండం పెరుగుదల-విడుదల సక్రమంగా లేకపోవడం, అండాశయ నాళాలు మూసుకుపోవడం, అండాశయాల్లో నీటి బుడగల్లాంటివి ఏర్పడడం, గర్భాశయ అంతర్భాగం గర్భధారణకు సిద్ధపడకపోవడం, గర్భాశయ ముఖద్వారం, అంతర్భాగం, బహిర్భాగం ఆరోగ్యంగా లేకపోవడం, పురుషుల్లో వీర్య కణాల సంఖ్య తక్కువగా ఉండడం, వీర్యకణాల నాణ్యత లేకపోవడం, వృషణాలు వీర్యనాళాల్లో లోపాలు, హార్మోన్ల స్థాయిలో లోపాలు, వృత్తిపరంగా ప్రతికూల వాతావరణాల్లో పనిచేస్తుండడం.

ఆధునిక వైద్య విధానాలు - హెచ్ఎస్‌జి పరీక్ష

చాలాసార్లు అండవాహికలు తెరుచుకోవడానికి ఇది ఉపయోగపడుతుంది. కొందరు కేవలం ఈ పరీక్ష తర్వాత గర్భం దాల్చుతారు.

ల్యాపరోస్కోపిక్ స్టడీ

అండాశయ, గర్భాశయ లోపాల నిర్ధారణకు, చికిత్సకు ఉపయోగపడగల సర్జికల్ విధానం. చాలా కేసుల్లో ఈ విధానం తర్వాత సంతాన అవకాశాలుంటాయి.

హిస్టరోస్కోపీ

బయట నుండి పంపిన కెమెరా ద్వారా గర్భాశయ స్థితిగతులు నిర్ధారించడం, తగిన పరిష్కారం సూచించడం.

టీసా(టిఇఎస్ఎ)

పురుషుల్లో వీర్యవాహిక మూసుకుపోయినపుడు వృషణాల నుండి డైరెక్టుగా వీర్యం సేకరించి ఫలితం సాధించడం.

ఐయుఐ(ఇంట్రాయుటెరైన్ ఇన్సెమినేషన్)

భర్త/దాత వీర్యకణాలు శుద్ధిపరిచి భార్యలో అండం విడుదల సమయం నిర్ధారించి, సరాసరి గర్భసంచిలో పొందుపరిచి ఫలితం సాధించడం. ఇది కొంచెం తక్కువ ఖర్చుతో సులభమైన విధానం.

ఐవిఎఫ్(ఇన్విటరో ఫెర్టిలైజేషన్)

స్త్రీలలో ఎక్కువ అండాలు వచ్చే విధంగా ప్రయత్నించి బయటకు తీసి, శుద్ధిపరిచిన భర్త వీర్యంతో కలిపి పిండోత్పత్తి జరిపి తల్లి గర్భంలో ప్రవేశపెట్టి ఫలితం సాధించడం

ఐసిఎస్ఐ(ఇంట్రాసైటోప్లాస్మిక్ స్పెర్మ్ ఇంజెక్షన్)

భర్త వీర్యకణాల సంఖ్య మరీ తక్కువగా ఉన్నప్పుడు సరైన ఒకే వీర్య కణాన్ని, బయటకు తీసిన భార్య అండంలోకి మైక్రో ఇంజక్షన్ పద్ధతిలో ప్రవేశపెట్టి పిండోత్పత్తి జరిపి తల్లి గర్భాశయంలో ప్రవేశపెట్టి ఫలితం సాధించడం.

ప్రతికూలాంశాలు

ఈ వైద్య విధానాలు కొంచెం ఖర్చుతో కూడుకున్నవే అయినా ఫలితానికి గ్యారంటీ లేనందున పెట్టిన భారీ ఖర్చులు తిరిగి రావు. కానీ పైపద్ధతుల్లో ఓ మూడుసార్లు ప్రయత్నిస్తే ఫలితం ఉండకపోదు. ❋

నిలయం
శ్రీకాకుళం

డా॥ విజయ్

వన్యప్రాణులు... ప్రకృతి సౌందర్యాల కలబోత



కాజిరంగ

ఎత్తుగా పెరిగిన గడ్డి సందర్శకులను ఆహ్వానిస్తుంటుంది. ఈ గడ్డి పరకల్లోనే జింకలు, దుప్పులు చెంగు చెంగున పరిగెడుతుంటాయి. ఏనుగులు, ఖడ్గమృగాలు, పులులు గంభీరంగా అటూ ఇటూ తిరగాడుతూ దర్శనమిస్తాయి. వన్యప్రాణులను బాగా సన్నిహితంగా చూసి సంతోషించాలనుకునేవారు...ప్రకృతి అందాలను తనివితీరా ఆస్వాదించాలనుకునేవారు కాజిరంగా జాతీయ ఉద్యానవనం తప్పక చూడవలసిందే. మరి ఈ వారం ఆ వివరాలు తెలుసుకుందామా!

పదహారవ శతాబ్దానికి చెందిన వైష్ణవ పండితుడు - శ్రీమంత శంకరదేవ. ఓసారి ఆయన దగ్గరకు ఇద్దరు దంపతులు వచ్చారు. సంతాన లేమి సమస్యతో వచ్చిన ఆ కాజి, రంగై దంపతులకు శంకరదేవుడు ఆ ప్రాంతంలో ఒక చెరువు తవ్వమని సలహా ఇచ్చాడు. ఆ చెరువే కాజిరంగ పేరుతో ప్రసిద్ధమైనదని కథనం.

ఇందుకు ఆధారంగా 17వ శతాబ్ది ప్రాంతంలో ప్రతాప్ సింఘు అనే రాజు ఒక చేప తిని, దాని రుచి మెచ్చుకుని ఆరా తీయగా, అది కాజిరంగ సరస్సులోదని తెలిసింది. ఇది చరిత్ర. ఇటువంటి స్థలనామ కథనాలు చాలానే ఉన్నా అస్సాంలోని గోలాఘాట్, నాగావ్ జిల్లాల్లో 430 చదరపు కిలోమీటర్లలో విస్తరించి ఉన్న జాతీయవనం కాజీరంగ. ఇది ప్రపంచ వారసత్వ స్థలంగా గుర్తింపు పొందింది కూడా.

రక్షిత ప్రాంతాలన్నింటిలోకంటే పెద్దపులుల సంఖ్య ఇక్కడే ఎక్కువ. దీనిని 2006లో టైగర్ రిజర్వ్‌గా ప్రకటించారు. ఈవనంలో ఏనుగులు, నీటి దున్నలు, బురద జింకలు విస్తారంగా ఉన్నాయి. ఎన్నో రకాల పక్షులకు కూడా ఇది ఆవాసం. ప్రపంచ ప్రసిద్ధమైన ఒంటికొమ్ము ఖడ్గమృగాలకు ఇది ప్రసిద్ధి చెందింది.

1904లో లార్డ్ కర్జన్ భారతదేశపు వైస్రాయ్‌గా వుండేవాడు. ఆయన, భార్య మేరీ



విక్టోరియాతో కలిసి ఈ ప్రాంతాన్ని సందర్శించినప్పుడు వారికి ఖడ్గమృగం కనిపించలేదు. నిరాశతో మేరీ తనభర్తని ఖడ్గమృగాల రక్షణకు ఏదైనా చేయమని కోరింది. 1905, జూన్1న 232 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో కాజిరంగ రిజర్వ్ ఫారెస్ట్ ఏర్పాటైంది. అయితే 1908కి గానీ దానిని అధికారికంగా ప్రకటించలేదు. 1916 నుండి 1938 వరకూ ఇందులో వేటకు కూడా అనుమతి వుండేది. 1974లో దానిని జాతీయ వనంగా గుర్తించారు. 1895లో యునెస్కో వారు ప్రపంచ వారసత్వ సంపదగా ప్రకటించారు.

సఫారీ చేయొచ్చు

ఈ దట్టమైన అభయారణ్యంలో జీప్ సఫారీ, ఏనుగుల సఫారీకి అనుమతి ఉంది. వర్షాకాలంలో నది పొంగి విపరీతమైన వరద వస్తుంది. అరణ్యంలో రోడ్లన్నీ పోతాయి. మళ్లీ కొత్తగా వేయవలసి వస్తుంది. జీపు సఫారీలో అక్కడక్కడా జింకలు, బురదలో ఖడ్గమృగాలూ, దున్నలూ కనిపిస్తాయి. కానీ దేశంలో కెల్లా ఇక్కడే ఎక్కువగా ఉన్నట్టు చెప్పుకున్న పులులు మాత్రం చాలా అరుదుగా కనిపిస్తాయి. కాజిరంగ మొత్తం దట్టమైన, ఎత్తైన గడ్డితో నిండి వుంటుంది. కాబట్టి జీపు సఫారీ కన్నా ఏనుగు సఫారీనే మేలు. పైగా ఉదయాన్నే బయలుదేరే ట్రిప్పులో అయితే కాజిరంగని మరింత అద్భుతంగా తిలకించవచ్చు.

అనువైన సమయమిదే...

కాజిరంగని దర్శించడానికి అనువైన సమయం సెప్టెంబర్- అక్టోబర్ గానీ, ఫిబ్రవరి-మార్చి గానీ. ఏప్రిల్ నుండి విపరీతమైన వేడి, ఉక్క. నవంబర్ నుండి జనవరి వరకు చాలా చలిగా ఉంటుంది. వర్షాకాలం ఏమాత్రం అనువుగా ఉండకపోవటమే కాక ప్రమాదం కూడా. అందువల్ల ఆ కాలంలో వనాన్ని మూసివేస్తారు.

ఇలా చేరొచ్చు

కాజిరంగ చేరాలంటే గౌహతి నుండి ది బ్రూగఢ్ నుండి, జోర్హాట్ నుండి బస్సు సౌకర్యం ఉంది. కాజిరంగ లోపలికి వెళ్లటానికి మూడు మార్గాలున్నాయి. కొహోరా, బాగోరీ, అగ్రతోలి. వాటిలో కొహోరా చాలా పేరొందింది. ఎక్కువ మంది దీని ద్వారానే లోపలికి వెళ్తారు. చాలా పేరొందిన వెల్డ్ గ్రాస్ రిసార్టు ఒకటుంది. హైవే నుండి 5 కిలోమీటర్ల దూరంలో (కొహోరా నుండి బోకాఖత్ దారిలో) ఉంది. చాలామంది ఇక్కడ బస చేస్తారు. కాస్త ఖరీదైనది. పార్కుకి చేరగానే ఫారెస్ట్ ఆఫీసులో ఏనుగుల సఫారీకి పేర్లు బుక్ చేయించుకోవాలి. వన్య ప్రాణులనూ, ప్రకృతి సౌందర్యాన్ని ఇష్టపడే వాళ్లకి కాజిరంగ మంచి అనుభూతినిస్తుంది. ❋



మీరు చూసిన ప్రదేశాల వివరాలు పంపండి

కుటుంబ సభ్యులతోనో, మిత్రులతోనో కలిసి వెళ్ళి ప్రసిద్ధిగాంచిన అనేక ప్రదేశాలు, కట్టడాలు చూస్తుంటాం. ఫొటోల్లో మన జ్ఞాపకాలను పదిల పరచుకుంటుంటాం. ఆ వివరాలకు ఫొటోలు జతచేసి పంపితే ఇదే శీర్షికలో ప్రచురిస్తాం. మా చిరునామా:

'చూద్దామా', ఆదివారం అనుబంధం, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం. 1, అశోక్‌నగర్, హైదరాబాద్.

తెర

> "తెలుగు రాయటంలో, ఉచ్ఛరించటంలో సాధారణంగా కనిపిస్తున్న లోపాలను పేర్కొని వాటిని సరిదిద్దడంతో రచన ఆరంభమవుతుంది. ఒత్తులెక్కడున్నవో తేలక బాధపడే వాళ్ళు మనలో చాలా మంది వున్నారు. సంధులెలా చేస్తే సరిగా వుంటుందో తెలుసుకోవడం మంచిది.... ఒకే పదం విశేష్యంగా క్రియగా విశేషణంగా వున్న సందర్భాలనేకం. అవేమిటో తెలుసుకోవడం అవసరం. మాటలకున్న అర్థాల్లో ఎన్నో విధాల మార్పులు వస్తుంటాయి... పర్యాయ పదాలనిపించేవి కొన్నయితే నానార్థాల్లా వినిపించేవి మరికొన్ని. ..ఇవన్నీ ఒక ఎత్తయితే సంస్కృతం నుంచి ఏ మార్పు లేకుండా తెలుగులో వచ్చి చేరిన మాటల గురించి చేసిన విశ్లేషణ మరో ఎత్తు. ఏ ఉపసర్గ చేరినప్పుడు ఏ ధాతు రూపానికి ఏ అర్థ విశేషం వస్తుందో రచయిత చాలా విపులంగా వివరించాడు.

మాటల బాట భాష బావుటా



మనం వినియోగించే చాలా వస్తువుల వెనక వున్న శాస్త్రం, తర్కం, చరిత్ర మనకు పూర్తిగా తెలియదు. కాని వాటికి మన జీవితాల్లో ఎనలేని ప్రాధాన్యత వుంటుంది. ఇదే సూత్రం సామాజికాంశాలకూ వర్తిస్తుంది. ఉదాహరణకు భాష విషయమే తీసుకుంటే దాని ఆవిర్భావం, వికాసం,విస్తరణ, వికృతి అన్నిటికీ స్పష్టమైన కారణాలుంటాయి. కాకపోతే వాటి లోతుపాతులు భాషా వేత్తలకూ వైయ్యాకరుణులకు(వ్యాకరణవేత్తలకు) తప్ప మామూలు మనుషులకు తెలియవు.కాని తెలుసుకోవలసిన అవసరం మాత్రం అందరికీ వుంటుంది. తెలుగు భాషా బోధనలో విశేషానుభవం గడించిన డాక్టర్.డి.చంద్రశేఖరరెడ్డి రాసిన 'మనభాష' ఆ కొరత తీర్చే పుస్తకాల్లో ఒకటి. బూదరాజు రాధాకృష్ణ, చేకూరి రామారావు వంటి వారి తరహాలోనే తెలుగు మాటల వాడుకపై విశేషమైన ఆసక్తితో అధ్యయనం చేసిన ఈ రచయిత ఒక భిన్నమైన ప్రణాళికతో మాటల పుట్టుకనూ అన్వయాన్ని వివరించారు.

మనుషులను జంతువుల నుంచి వేరు చేసే ప్రక్రియ మాట. మెదడు కూడా ముఖ్యమైన తేడా అయినప్పటికీ మౌలికమైన తేడా మాత్రం మాట. మాట పని చేసే క్రమంలో పుట్టింది. దాన్నే ఉత్పత్తి అంటుంటాం. ఈ ఉత్పత్తి వేర్వేరు కాలాల్లో వేర్వేరు ప్రాంతాల్లో వేరు వేరు పరిస్థితుల్లో జరుగుతుంది గనకే ప్రపంచంలో ఇన్ని భాషలు వెలిశాయి. అందులోనూ భారత దేశంలో భాషా బాహుళ్యత మరీ ఎక్కువ.

నిరంతర సజీవ ప్రవాహమైన భాషా వికాసం ఒక స్థిర బిందువు దగ్గర ఆగిపోయేదీ కాదు. ఏ ఒక్కరో ఒక సందర్భంలో శాసించిన ప్రకారమే భాషా గమనం వుండదు కూడా. ఆయా చారిత్రిక సాంస్కృతిక పరిణామాలు భాషల పరిణామాన్నీ నిర్దేశిస్తుంటాయి. ఒక దశలో వుండే ప్రభావాలు మారినప్పుడు ప్రయోగాలూ మారిపోతాయి. భాషా పరిణామంపై వాటి చెరగని ముద్ర అలాగే వుండి పోతుంది. కాని తర్వాత వారికి అవన్నీ ప్రత్యక్షంగా తెలియక పోవచ్చు. దేశంలోని ప్రాచీన భాషలలో ఒకటైన తెలుగుకు ఈ సమస్య చాలా ఎక్కువగానే వుంది. తెలుగు భాషకు అన్యాయం జరుగుతోందని ఆవేదన చెందుతున్న వారు కూడా దాని పుట్టుక పెరుగుదలను క్రమ పద్ధతిలో పరిశీలిస్తున్నారా అనేది సందేహమే. తెలుగులో ఇప్పుడు మనం వాడే మాటలన్నీ గతంలో ఇలా లేవు. అచ్చ తెలుగు అనుకుంటున్నవి కూడా పరభాషా ప్రభావం లేనివీ కావు. అలాగే భాషా పరమైన తప్పొప్పుల గురించిన మన భావాలన్నీ ప్రామాణికమైనవి కావు. ఆ మాట కొస్తే భాష విషయంలో ప్రమాణాలు లోక రీతిని బట్టి మారిపోతుంటాయి. "జనని సంస్కృత భాష సమస్త భాషలకును" అని నమ్మే వారు ఆ ప్రభావం వల్లనే తెలుగు నాశనమై పోయిందని కోపగించే వారు మరికొందరు.అలాగే ఇప్పుడు ఇంగ్లీషు వల్లనే తెలుగు నాశనమై పోతున్నదని కుమిలే వారు కొందరైతే తెలుగును వదిలేసి ఇంగ్లీషును పట్టుకుంటే అరచేతిలో వైకుంఠంలా అర్జంటుగా అభివృద్ధి చెందుతామని భ్రమ పడేవారు మరెందరో. పాలకులు కూడా దీన్ని నమ్మి ఇప్పుడు ఓనమాలు కూడా రాని పిల్లలకు ఇంగ్లీషు పాఠాలు చెప్పే ఏర్పాటు చేయించారు! ఇప్పటికే దట్టంగా అల్లుకు పోయిన ఇంగ్లీషు మీడియం వల్ల పైతరగతుల పిల్లల్లో చాలామంది ఇంగ్లీషు మీడియా ఇంగ్లీషు చిత్రాలు తప్ప తెలుగును చదవలేని స్థితి వచ్చేస్తున్నది. వీరే మీడియాలో గాని, ఇతరత్రా గాని తెలుగు రాయవలసి వస్తే పరదేశీయులను మించి అవస్థ పడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మనభాష వంటివి బాగా ఉపయోగపడతాయి.

"తెలుగు రాయటంలో, ఉచ్ఛరించటంలో సాధారణంగా కనిపిస్తున్న లోపాలను పేర్కొని వాటిని సరిదిద్దడంతో రచన ఆరంభమవుతుంది.ఒత్తులెక్కడున్నవో తేలక బాధపడే వాళ్ళు మనలో చాలా మంది వున్నారు.సంధులెలా చేస్తే సరిగా వుంటుందో తెలుసుకోవడం మంచిది.... ఒకే పదం విశేష్యంగా క్రియగా విశేషణంగా వున్న సందర్భాలనేకం. అవేమిటో తెలుసుకోవడం అవసరం. మాటలకున్న అర్థాల్లో ఎన్నో విధాల మార్పులు వస్తుంటాయి... పర్యాయపదాలనిపించేవి కొన్నయితే నానార్థాల్లా వినిపించేవి మరికొన్ని. ..ఇవన్నీ ఒక ఎత్తయితే సంస్కృతం నుంచి ఏ మార్పు లేకుండా తెలుగులో వచ్చి చేరిన మాటల గురించి చేసిన విశ్లేషణ మరో ఎత్తు. ఏ ఉపసర్గ చేరినప్పుడు ఏ ధాతు రూపానికి ఏ అర్థ విశేషం వస్తుందో రచయిత చాలా విపులంగా వివరించాడు. సంస్కృత తద్ధిత ప్రత్యయాలనూ, రూపాలనూ విశదీకరించారు. ఈ వివరాల కోసం నిఘంటు వ్యాకరణాలు గాలించవలసి వస్తుంది. పాఠకులకు ఆ శ్రమ తప్పించడానికి చంద్రశేఖరరెడ్డి తాము పరిశ్రమించారు..." అని కీ.శే. బూదరాజు ముందుమాటలో పుస్తకం విశిష్టతను అభినందించారు.

'భాష ప్రాధాన్యం మనకు తెలుసు. అయినా భాషా ప్రయోగంలో మనం తగినంత శ్రద్ధ చూపించడం లేదు. ఈ అశ్రద్ధ రాయడంలోనూ వుంది... ఒక ఇంగ్లీషు మాటను రాసేప్పుడు వర్ణక్రమం(స్పెల్లింగు)లోనూ, ఔచిత్యవంతమైన ప్రయోగంలోనూ ఎంతో జాగ్రత్తగా వుంటాం. సంస్కృతమైనా, హిందీ అయినా మరే భాష అయినా అంతే. మాతృభాషను వాడటంలో మనకు బోలెడు నిర్లక్ష్యం వుందనడంలో సందేహం లేదు. దుకాణాల పేర్ల బోర్డులు గాని, గోడల మీద రాసిన నినాదాలు అడ్వర్టయిజ్‌మెంట్లు కాని, పోస్టర్లు కాని కర పత్రాలు కాని చూసినప్పుడు ఈవిషయం అర్థమవుతుంది.. ఇంతమంది తెలుగు వారిలో ఆధునిక రచనాభాషను సక్రమంగా వాడగలిగిన వారి సంఖ్య పరిమితమే. మన ఉపన్యాసాలు కూడా అటు గ్రాంథికమూ ఇటు వ్యావహారికమూ కాని సంకర భాషలో ఉంటాయి. ప్రతి తెలుగు వాడూ చక్కని తెలుగు మాట్లాడగల, రాయగల సామర్థ్యాన్ని సాధించాలి. సర్వ సామర్థ్యాలకూ మూలం భాషా సామర్థ్యం...." అని రచయిత తన వుద్దేశాన్ని వివరించారు. ఈ లక్ష్యంతోనే వంద వారాల పాటు వార్త ఆదివారం అనుబంధంలో రాసిన ధారావాహికకు పుస్తక రూపం ఇది.

'ఇది వచన యుగం' అంటూ మొదలైన తొలి వ్యాసంలో రచయిత ఆధునిక కాలంలో రచయితలు ముఖ్యంగా పాత్రికేయులు ఎదుర్కొంటున్న మూడు సమస్యలను వివరించారు. గత వెయ్యేళ్ల గ్రాంథిక భాషా ప్రభావం నుంచి బయటపడటం, ఇతర భాషల నుంచి అరువు తెచ్చుకున్న మాటల్ని తెలుగులో రాసే పద్ధతి, అవసరమైన కొత్త పదాల కల్పన అనేవాటిని ఆయన పేర్కొన్నారు. 'రాతలో దొర్లే పొరబాట్లు' అన్న మరో భాగంలో ఋ,ౠలను రురులను ఉపయోగించడంలో వుండే సమస్యలను ఉదహరించారు. కృష్ణ,క్రిష్ణ/ క్రుంగు,కృంగు/ దృవీకరణ, ధ్రువీకరణ వంటి వాటిలో ఏది సరైన రూపమో చెప్పారు. తర్వాత 'అచ్చుతో ఎందుకు రాయాలి?' అని ప్రశ్నించి ఇఈఎఏ అని గాక యి యీ యెయే అని ఎందుకు రాయకూడదో వివరణ ఇచ్చారు. 'ఏది తెలుగు -ఏది సరస్కృతం అన్న భాగంలో ఎఐలు వున్న పదాలన్నీ తెలుగు దేశ శబ్దాలని స్థూలంగా వివరించారు. తెలుగులో ఐఔలు ప్రత్యేకంగా వుండవనీ.అలాగే విసర్గ సంస్కృతంలోంచే తెలుగులోకి వచ్చిందని మరో రెండు భాగాలలో చెప్పారు. మనః తపః వంటి అరసున్నా ప్రయోగాలను ఎలా అర్థం చేసుకోవాలో తెలిపారు. సున్నా ఎక్కడ అన్నది మరో ఆసక్తికరమైన అధ్యాయం.సంస్కృత సంపర్కంతో ఏర్పడిన తత్సమ తద్భవాల పూర్వాపరాలు ఎరుక పరచారు. అలాగే అల్పప్రాణాలు,మహాప్రాణాలు(క-ఖ,త-థ)వంటి వాటి సంబంధాన్ని తెలిపారు.టరల తారుమారును పరామర్శించారు. శషల శషభిషలను తేటతెల్లం చేశారు. అర్థ, అధి వంటి మాటల నుంచి ఎన్ని రకాలైన పదాలు పుట్టాయో చూస్తే ఆశ్చర్యం కలుగుతుంది. అధముడు, అధరం అన్న రెండు మాటలకూ ఆధారం ఒక్కటే! మొదటి దానికి కింద వుండేవాడని, రెండో మాటకు దిగువ పెదవి అని అర్థం! అలాగే ధ తో పదాలు వుండొచ్చు గాని థ తో పదాలు మొదలవడం జరగదని మరో సూత్రం. ఇక పేర్లలో కూడా తెలుగు మూలం వున్నవీ సంస్కృతం నుంచి దిగుమతి అయినవీ విడివిడిగానే కనిపిస్తాయి. లింగభేదం కూడా పేర్లలో అన్ని సందర్భాల్లో ఒకేవిధంగా వుండదు. కృష్ణంరాజుకు పూర్వ రూపం కృష్ణమ్మ కృష్ణమ. ఇదే వూపులో రచయిత పేర్ల అనువాదంగురించి పరిశీలించారు.

పదాది సంయుక్తాలు అన్న భాగంలో తెలుగు పదాల కూర్పుకు వివరణ ఇచ్చారు. అచ్చ తెలుగు మాటల్లో ఙళయ పదం మొదట వుండవు. వు వూ వో వో కూడా వుండవు. ఉఊ వంటి అచ్చులే వుంటాయి. క్కగ్గ,చ్చ వంటి వాటితో మాట మొదలు కాదు. పదాదిలో సంయుక్తాలుగా కనిపించేవి కూడా ఒక అచ్చు మాయమైనందువల్లనే కలుగుతున్నాయి. ఉదాహరణకు మ్రోగు-మొరగు వంటి మాటలను చూడొచ్చు. ఇక ఇప్పుడైతే వ్రాయు- రాయు, క్రింద- కింద, క్రొత్త- కొత్త వంటి మాటలలో రకారం మాయమై పోయింది.మ్రుగ్గు,బ్రతుకు, మ్రింగు,ప్రొద్దు వంటివన్నీ ఈ కోవలోవే. భాషల పరస్పర ప్రభావం కింద ఇంగ్లీషుతో పాటు ఇతర భాషలు కూడా తెలుగులో ఎలా ప్రవేశించాయో ఎలా ప్రభావం చూపుతున్నాయో రచయిత సుబోధకంగా చెబుతారు. 'క్రియా నామవాచకమా' అన్న శీర్షికన అయిదు భాగాలు రాశారు. పట్టు, పగులు, నింపు,నిలుపు, మింగు, ఆశ్రయించు,వ్యాపించు, పాతు,పలుకు వంటి మాటలను అనేక విధాలుగా వాడుతున్నారు.

తెలుగుపదాలలో దు(దంపుడు,వేపుడు), (నిలుపు,పొలుపు,పేర్పు,తలపు),త(కూత,తీత,వేత, మోత),ఇక(కలయిక, ఎంపిక,చేరిక,కోరిక), క(ఎరుక, అలుక, ముక్క మూక), (మిక్కిలి,వూరి,ముడి), (విలువ,చేరువ,కొదువ, తెగువ) ఇలా ప్రత్యయాల చేరికతో పదాల మార్పును విశ్లేషించారు. ఇక అను(అనుదినం), ప్రతి(ప్రతిధ్వని), ఉప(ఉపాధ్యాయుడు,ఉపన్యాసం) అభి(అభిమానం) వంటి ఉపసర్గల కలయికతో కొత్త మాటల పుట్టుకను పరిచయం చేశారు. మార్పును ఆహ్వానిస్తూనే చంద్రశేఖరరెడ్డి ప్రామాణికతను ఎక్కువగా కోరుకుంటున్నట్టు కనిపిస్తుంది.

భాష, సాహిత్యం పట్ల ఆసక్తివున్నవారు తప్పక చదవదగ్గ పుస్తకం ఇది. వీటిని పరిశీలిస్తూ వుంటే పదాలను భాషను ఎలా చూడొచ్చుననే కొత్త కోణాలు ఆవిష్కరించబడతాయి.

మనభాష

డి. చంద్రశేఖర రెడ్డి

వెల:100/-, పేజీలు:218

ప్రతులకు: మీడియా హౌస్ పబ్లికేషన్స్

1-9-289/4, పోస్టాఫీసు పక్కన

విద్యానగర్, హైదరాబాద్.



మూలం : **బరీ మై హార్ట్ ఎట్ ఊండెడ్ నీ (డీ బ్రౌన్)**

తెలుగు సేత: **ముక్తవరం పార్థసారథి**

జరిగినకథ

ఆ తర్వాత కొద్దిరోజులకే, విక్టోరియో, మరో ఎనభై మందీ మింబ్రెస్ పర్వతాల్లోకి పారిపోయారు. శీతాకాలంలో గడ్డు పరిస్థితి ఏర్పడింది. 1878 ఫిబ్రవరిలో కొందరు సైనిక కేంద్రం దాకా వచ్చి లొంగిపోతామన్నారు. ఒంటరిగా ఎంతకాలం బతకగలరు? సాన్ కార్లోస్ నుండి తమ కుటుంబాలను కూడా పిలిపిస్తే అందరూ కలిసి వుంటారు. చాలాకాలం, సైనికులు, ఏ నిర్ణయమూ తీసుకోలేదు. అపాచీలు అనేకసార్లు వేడుకున్న తర్వాత, న్యూమెక్సికోలో స్థిరపడమని ఆదేశించారు. కాకపోతే అక్కడవాళ్లు, టూలారోసా వద్ద మెస్కాలెరో తెగ వాళ్లతో కలిసి సహజీవనం చెయ్యాలి. అన్ని షరతులకూ అంగీకరించాడు విక్టోరియో. అలా, రెండేళ్లలో మూడుసార్లు తన నివాస స్థలాలు మార్చారు వార్మ్‌స్ప్రింగ్స్ అపాచీలు.



జెరోనిమో

అమెరికన్ డేగ

65వ భాగం

అలా, సైనికుల కళ్ళు గప్పి పారిపోయిన వాళ్ళలో డెబ్భైఏళ్ళు దాటిన ఒక మింబ్రె నాయకుడు కూడా వున్నాడు. అతడి పేరు నానా. స్పానిష్, ఇంగ్లీష్ మాట్లాడే తెల్లవాళ్లందరితో పోరాటం చెయ్యటం బాల్యం నుండే అతనికలవడింది. ఈ దురాక్రమణదారుల్ని ప్రతిఘటించటం తప్ప మరో మార్గం లేదని గట్టిగా నమ్మాడు. ఒకసారి ఓడిపోతేనేం, పోరాటం కొనసాగించాల్సిందే. మరో గెరిల్లా సైన్యాన్ని తయారు చెయ్యాలి. తెల్లవాళ్ల పట్ల ద్వేషం వున్న యువకులు రిజర్వేషన్లలోనే దొరకుతారు. 1881లో, ఈ వృద్ధ అపాచీ, తన వెంట వున్న కొద్ది మంది మెరికల్లాంటి అనుచరులతో రయో గ్రాండి దాటి భీభత్సం సృష్టించాడు. నెల రోజుల్లో ఎనిమిది యుద్ధాలు చేసి, రెండు వందల గుర్రాలను స్వాధీనం చేసుకొని మెక్సికోలోకి తిరిగి ప్రవేశించాడు. వెయ్యి మంది అశ్వికులు అతణ్ణి వెంబడించారు గాని పట్టుకోలేక పోయారు. అపాచీల ఆగడాలతో తమ ప్రతిష్ట మంటగలుస్తున్నదని భావించిన ప్రభుత్వం, రిజర్వేషన్ల భద్రత కోసం వందలాదిగా అదనపు బలగాలను నియమించింది.

సైనికులు తమను అష్టదిగ్బంధనం చేసినందుకు సాన్‌క్లారోస్ రిజర్వేషన్‌లో వుంటున్న చిరికాహువాల్లో నిరసన పెరిగింది. కొత్త నిబంధనలు తమకున్న కొద్దిపాటి స్వేచ్ఛను కూడా హరించివేశాయి. తమకు సహకరించని ఇండియన్ నాయకులందర్నీ సైన్యం అరెస్ట్ చేయబోతుందని వదంతులు వ్యాపించాయి. ఒకరాత్రి జెరోనిమో, జు, నైషె మరో డెబ్భైమంది చిరికాహువాలు వైట్‌మౌంటెన్ నుండి తప్పించుకుని దక్షిణంగా, మెక్సికోలోని సియోరా మేదర్ స్థావరం వైపు దౌడు తీశారు.

ఆర్నెల్ల తర్వాత (ఏప్రిల్ 1882లో) వీళ్లు వైట్ మౌంటెన్‌కు తిరిగి వచ్చారు. ఈ సారి వాళ్ల లక్ష్యం తమ వాళ్లందర్నీ బలవంతంగానైనా విడిపించుకుని వెంట తీసుకుపోవటమే. నేరుగా చీఫ్ లోకో క్యాంపులో ప్రవేశించిన నాయకులు, మిగతా చిరికాహువాలనూ, వార్మ్ స్ప్రింగ్స్ అపాచీలనూ తక్షణం మెక్సికోకు రమ్మని కోరారు. అప్పటికే ఈ 'దుండగుల' కోసం కాపుగాసిన అధికారులు, కల్నల్ జార్జిఎ. ఫోర్సిల్ న్యాయకత్వంలో (ఏడవ అధ్యాయంలో ఇతని ప్రస్థావన ఉంటుంది) ఆరు కంపెనీల అశ్వికులను హుటాహుటిన క్యాంపుకు పంపారు. హార్స్ షూ కాన్యన్ వద్ద ఫోర్సిత్ వీళ్లను నిలువరించగలిగాడు కానీ, ఇండియన్లు సైనికులను ముప్పుతిప్పలు పెట్టి, సరిహద్దు దాటి మెక్సికోలోకి ప్రవేశించారు. అయితే, అనూహ్యంగా, అక్కడే మృత్యువు వాళ్ల కోసం నిరీక్షించింది. అపాచీల కదలికలను గమనించిన ఒక మెక్సికన్ పదాతిదళం దొరికిన వాళ్లను దొరికినట్టే నరికి చంపింది. మృతుల్లో అత్యధికులు స్త్రీలు, పిల్లలే.

లోకో, నైషే, చాటో, జెరోనిమోలు పారిపోగలిగారు కానీ, అనుచరుల మీద వాళ్ల పట్టు సడలింది. కొందరు నానా గెరిల్లాలను ఆశ్రయించారు. ఇప్పుడు వాళ్ల లక్ష్యం ప్రతిఘటన కాదు. జీవన్మరణ పోరాటం.

వైట్ మౌంటెన్ వద్ద ఇండియన్లు ఏ చిన్న నిరసన తెలిపినా, అదనపు సైనిక బలగాలు వచ్చి అణిచి వేస్తాయి. ఫోర్ట్ థామస్, ఫోర్ట్ అపాచీ, ఫోర్ట్ బోనీలు సైనిక నిలయాలుగా మారిపోయాయి. రిజర్వేషన్లలోని దుర్భర పరిస్థితుల్లో అధికారుల దురుసు ప్రవర్తనతో అపాచీలలో అసహనం రాజుకుంది. అవకాశం దొరికిన ప్రతిసారీ, మెక్సికో లోకి పారిపోవటానికి ప్రయత్నించారు. కానీ, అదీ అంత సులభం కాదు. దారిలో రాంచర్లు వాళ్లను అడ్డగించారు. ఘర్షణల్లో ఇరువైపులా ప్రాణనష్టం జరిగింది.

పరిస్థితిని అదుపు చేయటానికి జనరల్ జార్జిక్రూక్‌ను రంగంలోకి దింపింది ప్రభుత్వం. ఇప్పుడతనిలో చాలా మార్పు వచ్చింది. పదేళ్ల క్రితం సియోలు, షియెనీలను నామరూపాలు లేకుండా చేయడమే తన ధ్యేయమనేవాడు. వాళ్లతో సహజీవనమే అందరికీ శ్రేయస్కరమని అంగీకరించాడు. అతని దృష్టిలో "ఇండియన్లు కూడా మనుషులే" అయితే ఇతర సైనికాధికారులు ఆ విషయాన్ని ఇంకా అంగీకరించలేదు.

సెప్టెంబర్ 4, 1882 నాడు విపుల్స్ బరాక్స్ వద్ద డిపార్ట్‌మెంట్ ఆఫ్ అరిజోనా అధికారిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే, వైట్ మౌంటెన్ రిజర్వేషన్‌కు బయల్దేరాడు. సాన్ కార్లోస్, ఫోర్ట్ అపాచీలవద్ద ఇండియన్

నాయకులతో సుదీర్ఘంగా చర్చలు జరిపాడు. “అందరితోనూ మాట్లాడాను. వాళ్లకు మనపట్ల నమ్మకం సన్నగిల్లింది. మొదట చర్చలకు నిరాకరించారు. ఓపికగా చాలాసేపు విన్నాను. తెల్లవాళ్లవాళ్లందరూ ద్రోహం చేశారని అనుభవపూర్వకంగా తెలిసిందని తన కోపం వెళ్లగక్కారు”. అధికారులు ఒక్కొక్కరూ ఒక్కో ఆజ్ఞ జారీ చేస్తారు. ఎవరి మాటలు నమ్మాలో, ఎవరి మాటలు నమ్మకూడదో తెలియదు. నిష్కారణంగా మా ఆయుధాలు లాక్కున్నారు. రిజర్వేషన్లో ఉన్నప్పుడు కూడా సైనికులు తమ మీద దాడులకు పాల్పడుతున్నారు. తమ వేట ప్రాంతాల నుండి ఇంతదూరం తీసుకురావలసిన అవసరం ఏమొచ్చిందసలు? ఈ బానిస బతుకుల కన్నా ప్రతిఘటనతో మరణించటమే గౌరవప్రదమనే నిర్ణయానికి వచ్చారు” అని రిపోర్టిచ్చాడు. “వాళ్ల సహనం నశించింది. ఇప్పుడు ఇండియన్లను నియంత్రించటం ఎవరి తరమూ కాదు”.

ప్రభుత్వం ఇండియన్లకోసం పంపిన ఆహారపదార్థాలు, ఇతర వినియోగ వస్తువులను దళారులు, స్థానిక అధికారులు తస్కరిస్తున్నారు. కొందరు ఏజెంట్లు కూడా వాళ్లకు సహకరిస్తున్నారు. స్వలాభం కోసం తెల్లవాళ్లే అపాచీలను తిరుగుబాటుకు ప్రోత్సహిస్తున్నారని కూడా క్రూక్ తన పర్యటనలో గ్రహించాడు. ఏదో రకంగా ఇండియన్లు, రిజర్వేషన్లను ఖాళీ చేస్తే ఆ భూమికూడా తమకే దక్కుతుందని రాంచర్ల ప్లాను.

వ్యాపార లావాదేవీల నెపంతో రిజర్వేషన్లో తిష్టవేసిన మైనర్లు, రాంచర్లు, ఇతర దళారులను తక్షణం వెళ్లి పోవలసిందిగా ఆజ్ఞాపించాడు క్రూక్. తను ప్రవేశపెట్టబోతున్న సంస్కరణలకు పూర్తి సహకారం అందించవలసిందిగా ఇండియన్ బ్యూరోకు మరో సందేశం పంపాడు. ఇన్నాళ్లూ, రిజర్వేషన్లో ఒక్కో నిర్ణీత ప్రాంతానికే పరిమితం కావాలన్న రూలు తొలగించాడు. ఇప్పుడు ఇండియన్లందరూ ఆ రిజర్వేషన్లో ఎక్కడైనా స్వేచ్ఛగా తిరగవచ్చు. ఎక్కడైనా ఇళ్లు కట్టుకోవచ్చు. తెల్ల దళారులను పూర్తిగా తొలగించి, గడ్డి సప్లై చేసే కాంట్రాక్టులన్నీ అపాచీలకే అప్పగించాడు. ఇండియన్లు పండించిన కూరగాయలు, మొక్కజొన్నలను సైన్యం కొనుగోలు చేస్తుంది. అపాచీల్లో స్వయం పరిపాలనను కూడా ప్రోత్సహించాడు. వాళ్లు సొంత పోలీసు వ్యవస్థనూ, కోర్టులనూ ఏర్పరచుకోవచ్చు (జాన్ క్లమ్ కాలంలో కూడా ఇవన్నీ అమలు జరిగాయి). శాంతి భద్రతల పరిస్థితి అదుపు తప్పకుండా ఉన్నంత కాలం, తెల్లసైనికులు వాళ్లకు కనపడరని కూడా వాగ్దానం చేశాడు క్రూక్.

క్రూక్ గురించి అపాచీలకు సదభిప్రాయం లేదు. అతడెంత నిర్దాక్షిణ్యంగా కాచైస్‌నూ, చిరికాహువాలనూ వేటాడి ముప్పుతిప్పలు పెట్టాడో ఇంకా మరిచిపోలేదు. కానీ, త్వరలోనే, అతడి మాటల్లోని నిజాయితీ తెలిసి వచ్చింది. ఇప్పుడతను పాత క్రూక్ కాదు. ఇన్నాళ్లూ ఆకలితో అలమటించిన ఇండియన్లకు కడుపు నిండా భోజనం దొరికింది. ఏజెంట్లు, దళారుల బెడద తప్పింది. పశువుల మందలను పెంచుకోవడానికీ, మొక్కజొన్న, బీన్స్ పండించటానికీ వాళ్లను ప్రోత్సహించాడు గ్రే వుల్ఫ్ (అపాచీలు, క్రూక్‌కు పెట్టిన పేరది). రిజర్వేషన్ సరిహద్దుల్లో స్వేచ్ఛా జీవితమే గడిపారందరూ.

అయితే ఇది పరిమితమైన స్వేచ్ఛ. మెక్సికోలో ఉన్న తమ బంధువులు, సోదరులు ఎవరి ఆజ్ఞలకూ లోబడకుండా నిజమైన స్వేచ్ఛ అనుభవిస్తున్నారు. రిజర్వేషన్లోని కొందరు యువకుల్లో అసంతృప్తి మొదలైంది. కఠినంగా వ్యవహరించారని అధికారులను ధిక్కరించి మెక్సికోలోకి పారిపోయారు.

తనెన్ని సంస్కరణలు ప్రవేశపెట్టినా, సదుపాయాలు కల్పించినా చిరికాహువాలు, వార్మ్ స్ప్రింగ్ అపాచీలు మెక్సికోలో ఉన్నంత తృప్తిగా రిజర్వేషన్లో ఉండలేరని క్రూక్‌కి కూడా తెలుసు. సరిహద్దు గుండా రాకపోకలు కొనసాగుతూనే వున్నాయి. విచ్చలవిడిగా తిరుగుతూ, దాడులకూ, దొంగతనాలకూ పాల్పడుతున్న ఇండియన్లను నియంత్రించటానికి ఇరుపక్షాల సైనికులూ ఒకరి భూభాగంలోనికి మరొకరు ప్రవేశించవచ్చని మెక్సికోతో ఒక ఒప్పందం కుదుర్చుకుంది యునైటెడ్ స్టేట్స్. దీన్ని కూడా తనకు అనుకూలంగా మార్చుకోవాలనుకున్నాడు క్రూక్స్. ఇండియన్ల భూములు కబ్జా చేస్తున్న పౌరుల (అరిజోనా, న్యూమెక్సికోలలో ఉన్న రాంచర్లు, మైనర్లు) ఆగడాలకు ఈ సైనికుల సాయంతోనే అడ్డుకట్ట వేయొచ్చు.

“సరిహద్దు సంఘటనలను ప్రముఖ పత్రికలు కూడా తరచు వక్రీకరించి ప్రచురిస్తున్నాయి. నేరాలన్నింటికీ కేవలం ఇండియన్లదే బాధ్యత అని పాఠకులను నమ్మించ చూస్తున్నాయి. భాషాజ్ఞానంలేని వీళ్ల సమస్యల్ని కూడా విజ్ఞులైన మన పౌరులు తెలుసుకోవలసిన అవసరమున్నది. న్యాయాన్యాయాలు నిర్ణయించేటప్పుడు ఏకపక్షంగా తీర్పు చెప్పకూడదు. ప్రస్తుతం మన పత్రికల వైఖరివల్ల ఇండియన్లను మాత్రమే నేరస్తులుగానూ, మనవాళ్లను న్యాయ వర్తకులను గానూ జనబాహుళ్యం భావిస్తున్నది. ఇక్కడి అపాచీలు,చిరికాహువాలలో పెరుగుతున్న అసంతృప్తికి ముఖ్యకారణం ఇదే. న్యాయస్థానాలెప్పుడూ ఇండియన్లకే శిక్షలు విధిస్తున్నాయి. నేరాలు చేసిన తెల్లవాళ్లు స్వేచ్ఛగా తిరుగుతున్నారు. దీనివల్ల నేరాలు మరింత పెరగవా? ” అంటూ పై అధికారులకొక అర్జీ పంపిచాడు క్రూక్.

అపాచీలు మరో గెరిల్లా యుద్ధానికి సిద్ధమౌతున్నారని అతడికి తెలుసు. ఈసారి వాళ్లను అణిచి వెయ్యటం కష్టమే. ఇక్కడి భౌగోళిక,వాతావరణ పరిస్థితులు కూడా వాళ్లకే అనుకూలంగా వున్నాయి. “పరిస్థితులింతగా దిగజారడానికి బాధ్యత మనదే. తమకు న్యాయం

జార్జ్ క్రూక్

జరగనంతవరకూ ఇండియన్లు పోరాటం ఆపరు. తెల్లవాళ్ల దోపిడీ ఆగినప్పుడు మాత్రమే ఇక్కడి శాంతి భద్రతలు మెరుగుపడతాయి” అంటూ తన అంతరంగికుల ముందు అంగీకరించాడు.

యుద్ధంలో జయాపజయాలు సమస్యలను పరిష్కరించవు. జెరోనిమోను తమదారికి తెచ్చుకోవటమంటే అర్థం అతణ్ణి చిత్తుగా ఓడించటం కాదు. తమతో సహజీవనం వాళ్లకు కూడా మేలు చేస్తుందని నమ్మించగలగాలి. చర్చలు ప్రారంభించటానికి అనువైన చోటు గురించి తర్జన భర్జన చేశారు. మెక్సికోలోని వాళ్ల స్థావరమే బాగుంటుందన్నారు సలహాదార్లు. ఇలా చెయ్యటం వల్ల సుహృదయ వాతావరణం కూడా ఏర్పడుతుంది. అక్కడ, నిత్యం విషప్రచారం చేస్తున్న వార్తా పత్రికలుండవు. ఇండియన్ భూముల్ని స్వాహాచేస్తున్న రాంచర్లు సరిహద్దు దాటిరారు. రాంచర్లు

చాలా రోజులుగా, మెక్సికోలోకి ప్రవేశించటానికి ఒక ‘సాకు’ కోసం నిరీక్షిస్తున్న క్రూక్, నమ్మకస్తుడైన అనుచరులతో ఒక “అడ్వాన్స్ కంపెనీ” ఏర్పాటు చేసుకున్నారు. సుమారు యాభైమంది సైనికులు, పౌరులు,మరో రెండువందల యాభైమంది అపాచీలు అందులో సభ్యులు. (ఈ అపాచీలందరూ ఎప్పుడో ఒకప్పుడు మెక్సికో దాడుల్లో పాల్గొన్నవారే) 1883 ప్రథమార్ధంలో ఈ కంపెనీలోని కొందరు సరిహద్దుకు యాభైమైళ్ల దూరంలో ఉన్న (అరిజోనా) సదర్న్ పిసిఫిక్ రెయిల్‌రోడ్‌కు చేరుకున్నారు. మార్చి 21 నాడు చాటో, చిహువాహువా, బొనిటో తెగలకు చెందిన ముగ్గురు ఛోటా నాయకులు టూంబ్‌స్టోన్‌లోని గనుల మీద దాడిచేశారు. ఇది తెలిసిన వెంటనే క్రూక్‌కూడా మెక్సికోలోకి ప్రవేశించటానికి సన్నాహాలు పూర్తి చేసుకున్నాడు. (అయితే అనేక వారాల అన్వేషణ తర్వాత మాత్రమే (మెక్సికోలోని) సిమెరా మేడ్రే వద్దవున్న చిరికాహువాల చేజ్‌కాంప్ జాడ తెలుసుకోగలిగాడు).

ఇంకా వుంది....

కథా నిలయం
శ్రీకాకుళం

సంగీతం ఏ ఒక్కరి ఆస్తీ కాదు

జి.వి ప్రకాష్... 18 ఏళ్ళకే సంగీతదర్శకునిగా కెరీర్ ప్రారంభించారు. 22 ఏళ్ళకే సూపర్ స్టార్ రజనీకాంత్ చిత్రం 'కథానాయకుడు' (తమిళంలో 'కుచేలన్')కు స్వరాలు అందించే అవకాశాన్ని అందిపుచ్చుకున్నారు. భారతీయ సంగీతానికి ప్రపంచ ఖ్యాతి తెచ్చిపెట్టిన ఎ.ఆర్. రెహమాన్ మేనల్లుడైన జి.వి ప్రకాష్ లండన్ ట్రినిటి కాలేజీలో మ్యూజిక్ కోర్సు చేశారు. చిన్న వయసులోనే 'జంటిల్‌మేన్' చిత్రంలో 'చికుబుకు చికుబుకు రైలే...' అంటూ ఓ చిన్నపిల్లాడికి గాత్రాన్ని ఇచ్చారు. గాయకుడిగా కెరీర్ ప్రారంభించి 40 పాటలు పాడారు. 'మ్యూజిక్ డైరెక్టర్ కాకపోతే క్రికెటర్ అయ్యేవాణ్ణి' అంటున్న వర్ధమాన సంగీత దర్శకునితో మాటామంతీ...

సంగీత దర్శకుడు కాకముందు మీ జర్నీ ఎలా సాగింది?

మ్యూజిక్ డైరెక్టర్ కాకముందు నేనొక గాయకుణ్ణి. చిన్నప్పుడు 'జంటిల్‌మేన్'లో 'చికుబుకు చికుబుకు రైలే...' పాటలో ఓ పిల్లాడికి పాడాను. సంగీతం నన్ను ఎలా ఆకర్షించిందో సరిగ్గా చెప్పలేను. మ్యూజిక్ అంటే పాషన్ అయింది. శ్వాసగా మిగిలింది. స్కూల్, కాలేజీ డేస్‌లో సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ గిటార్ వాయించేవాణ్ణి. ఆ టైమ్‌లో ఇళయరాజాగారి నుంచి స్ఫూర్తి పొందాను. రెహమాన్ నా ఐడల్. 'చికుబుకు చికుబుకు రైలే...' తర్వాత 40 పాటలు పాడివుంటా. క్రమంగా కమర్షియల్ యాడ్స్, రేడియో ప్రోగ్రామ్స్‌కు మ్యూజిక్ అందించాను. కొన్ని తమిళ చిత్రాలకు మ్యూజిక్ డిపార్ట్‌మెంట్‌లో పని చేశాను. 'వేయిల్' సినిమా ద్వారా సంగీత దర్శకునిగా పరిచయమయ్యాను. ఈమధ్యనే విడుదలైన 'కథానాయకుడు', 'ఉల్లాసంగా ఉత్సాహంగా' చిత్రాలకు స్వరాలు సమకూర్చాను.

రజనీ చిత్రానికి పనిచేసే అవకాశం ఎలా వచ్చింది?

అదొక అద్భుతం. రజనీ సార్ 'వేయిల్' చిత్రం చూసి ఇంప్రెస్ అయ్యి నాకీ అవకాశం ఇచ్చారు. మీకో ముఖ్యమైన విషయం చెప్పడం మరచిపోయాను. నేను ఆయనకు పెద్ద అభిమానిని. ఈ ప్రాజెక్ట్ చేసే అవకాశం వచ్చినప్పటి నుంచి నా శక్తి మేర కృషి చేశాను. సినిమా ఆడియోకు వచ్చిన స్పందన చూస్తుంటే ఆనందంగా ఉంది.

'సినిమా... సినిమా...' పాటకు ప్రేరణ ఏమైనా ఉందా?

75 ఏళ్ళ భారతీయ చలన చిత్ర పరిశ్రమే స్ఫూర్తి. అలాగే సినిమాల పట్ల నాకున్న అమితమైన ఇష్టం. సినిమాలో ఈ పాట రజనీ సార్ ఇంట్రడక్షన్ సాంగ్‌గా వస్తుంది. ఆయన అభిమానులు మాగ్జిమమ్ ఎంజాయ్ చేసేలా ఈ పాట ఉంటుంది.

మీ పనితనంపై మామయ్య ప్రభావం ఎంత వరకు ఉంటుంది?

అలాంటిది ఉన్నా... సంగీత దర్శకుడిగా సొంత గుర్తింపు కోసం ప్రయత్నిస్తున్నాను. బెస్ట్ ట్యూన్స్ ఇవ్వడం ద్వారా అది సాధ్యమవుతుంది. గొప్ప గొప్ప వాళ్ళు ఇచ్చిన ట్యూన్స్ విన్నప్పుడు, దీనికంటే రెండు, మూడు రెట్లు బెటర్ ట్యూన్స్ ఇవ్వాలని కోరుకుంటాను.

ఎలాంటి మ్యూజిక్ ఇవ్వడానికి ఎక్కువగా ఇష్టపడతారు?

ఇలాంటి సంగీతమే ఇవ్వాలి... అన్న కొలబద్ద మ్యూజిక్‌లో ఉండదు. సన్నివేశాలకు అనుగుణంగా సమకూర్చాలి. అలాగే అది కాలానుగుణంగా మారుతుంటుంది. సృజనాత్మకత లోంచి బెస్ట్ మ్యూజిక్ వస్తుంది.

మంచి మ్యూజిక్ డైరెక్టర్‌గా రాణించాలంటే శాస్త్రీయ సంగీతంలో ట్రైన్ అయి ఉండాలంటారా?

కచ్చితంగా అని చెప్పను. కాకపోతే అదనపు లాభం చేకూరుతుంది. సంగీతమనే కళకు పరిపూర్ణతను తీసుకొస్తుంది. నా వరకు అందులో ట్రైన్ అయ్యాను. మన సమాజం, ప్రజలు, సంస్కృతి వంటి మౌలిక లక్షణాలను అర్థం చేసుకోవడానికి శాస్త్రీయ సంగీతం దోహదపడుతుంది. పాశ్చాత్య, శాస్త్రీయ సంగీతాన్ని బ్యాలెన్స్ చేసుకోవడానికి కూడా తోడ్పడుతుంది.

తెలుగు తొలి స్ట్రయిట్ చిత్రం 'ఉల్లాసంగా ఉత్సాహంగా' గురించి చెప్పండి?

చిత్ర దర్శకుడు కరుణాకరన్ కారణంగా 'ఉల్లాసంగా ఉత్సాహంగా' చేశాను. బాల్యం నుంచి నేనేమిటో... నాలోని పాషన్ ఏమిటో ఆయనకు తెలుసు. ఆయనకు ఏం కావాలో నాకు తెలుసు. ఆయనొక మంచి క్రియేటివ్ డైరెక్టర్. ఎలాంటి మ్యూజిక్ రాబట్టుకోవాలో ఆయనకు బాగా తెలుసు.

మీ కెరీర్‌లో ఎప్పుడైనా నిరుత్సాహానికి లోనయ్యారా?

'కాదల్' (తెలుగులో 'ప్రేమిస్తే') చిత్రం అవకాశం వచ్చి, ఆ తర్వాత చేయలేకపోయినప్పుడు.

మీ కంపోజింగ్ స్పెషాలిటీ...

ప్రత్యేకత ఉందని భావించడం లేదు. ముందుగా నన్ను నేను తృప్తి పరచుకుని సన్నివేశంలో ఇమిడిపోయే స్వరాలు ఇవ్వడానికి ప్రయత్నిస్తాను. ఇలా వెళ్ళడమే నా బలం అనుకుంటా!

ఒకవేళ మ్యూజిక్ డైరెక్టర్ కాకపోతే...

క్రికెటర్ అయ్యేవాణ్ణి. క్రికెటర్ కాకపోయినా... 'ఐ.పి.ఎల్ చెన్నయ్ సిరీస్'కు మ్యూజికల్ బీట్స్ అందించాను.

మీ అభిమాన మ్యూజిక్ డైరెక్టర్?

హాలీవుడ్‌లో చాలామంది ఉన్నారు. దక్షిణ భారతదేశంలో ఓన్లీ ఒన్ 'రెహమాన్'. అందరు సంగీత దర్శకులు సమకూర్చిన మంచి పాటలు వింటాను. అలాగే వాళ్ళ కంపోజింగ్ బలాన్ని గ్రహిస్తాను. సంగీతం ఏ ఒక్కరి ఆస్తీ కాదు. అదొక శక్తి.

అభిమాన నటులు...

హిందీలో అమీర్ ఖాన్, షారూక్ ఖాన్. తెలుగులో మహేష్‌బాబు, తమిళంలో రజనీకాంత్.

మరి హీరోయిన్స్...

కాజోల్, సిమ్రాన్.

నా పేరే నా సమస్య

నా పేరు నల్లోడు. నేను డిగ్రీ పూర్తి చేశాను. నా సమస్యంతా నా పేరే. నా పేరు వలన నేను దేనిలో కూడా ఉత్సాహంగా పాల్గొనలేకపోతున్నాను. నాకు క్విజ్‌లో పాల్గొనాలని, స్టేజ్ పైకి వెళ్ళి మాట్లాడాలని చాలా ఆశగా ఉండేది కాని నా పేరు నన్ను వెనక్కు లాగేస్తుంది. నాపేరు మార్చుకోవడానికి వీలుంటుందా? ఉద్యోగాలకు అప్లై చేసేటప్పుడు నాకు ఎలాంటి సమస్య రాకుండా ఏం చేయాలి? దయచేసి సలహా ఇవ్వండి?

నల్లోడు, పాలకొల్లు.

తన పేరు ఇష్టపడిన వాళ్లే ఉన్నతంగా ఎదగగలుగుతారు. ఏదైనా మనం ఆలోచించే విధానంలోనే వుంటుంది. మీరు చిన్నతనం నుంచి మీ పేరునే సమస్యగా ఊహించుకున్నారు. దానితో మీ పేరుతో ఎవరు పిలిచినా తట్టుకోలేకపోతున్నారు. మీ పేరును ఇష్టపడటానికి ప్రయత్నించండి లేదా 'లాయర్' ద్వారా మీ పేరును మార్చుకోవచ్చు. కాని కొంత సమయం పడుతుంది. ప్రాబ్లమ్ ఏమీ ఉండదు.

....దొంగతనంగా చూస్తాను

నాకు ఒక చెడ్డ అలవాటు వుంది. స్త్రీలు దుస్తులు మార్చుకుంటున్నప్పుడు, స్నానం చేస్తున్నప్పుడు దొంగతనంగా చూడటం అలవాటయ్యింది. దీని వల్ల ఎక్కువ లైంగికోద్రేకాన్ని పొందుతాను. దీనిని మానలేక పోతున్నాను పరిష్కారం తెలుపగలరు?

శ్రవణ్, ఒంగోలు.

మీకు ఉన్న మానసిక సమస్యను "వాయుశిరిజమ్" అంటారు. ఇలా ప్రవర్తించే వారిని "పిపింగ్ టామ్స్" అంటారు. వాయిరిజమ్‌తో బాధపడుతున్న వారిలో అనేక మంది స్త్రీలతో మాట్లాడాలన్నా, రతి జరపాలన్నా భయాందోళనకు గురౌతారు. ఈ భయాందోళన వల్ల ఇటువంటి వారు స్త్రీలకు దగ్గరగా ఉంటే లైంగిక

స్పందనలు కలగవు. దీని వల్ల తాము అసమర్థులమని బాధపడుతుంటారు. ఈ స్థితిలో నగ్నంగా ఉన్న స్త్రీలను దొంగతనంగా చూడటం జరిగితే లైంగిక స్పందనలకు లోనౌతారు. దీని వల్ల ఈ వాయిరిజమ్‌కు అలవాటు పడుతుంటారు. 'సైకోథెరపి' ద్వారా మీలో ఉన్న ఆత్మనూన్యతా భావాన్ని తగ్గించడమే కాక స్త్రీలంటే ఉన్న భయాన్ని తగ్గించవచ్చు. 'బిహేవియర్ థెరపి' ద్వారా చూడడంపై ఉన్న మక్కువను తగ్గించవచ్చు. మీరు కౌన్సిలింగ్ సైకాలజిస్ట్‌ను, సెక్స్ థెరపిస్ట్‌ను కలవండి.

వళ్లంతా దురదలే

నా సమస్య ఏమిటంటే శరీరం అంతా దురదలు వస్తాయి. ఎంత మంది డాక్టర్లు ఎన్ని టెస్ట్‌లు చేసినా 'నీకు ఏమి లేదు' అని అంటున్నారు. దీనివల్ల సరిగ్గా చదవలేక పోతున్నాను. దీనికి పరిష్కారం తెలుపగలరు?

రామ్‌నాథ్, నంధ్యాల.

ఏ విధమైన శారీరక వ్యాధి లేకుండా శరీరమంతా దురదలు రావటాన్ని "సైకోజెనిక్ ప్రురైటిస్" అంటారు. మనసులోని ఆందోళన, కోపం, చిరాకు, బాధ మొదలైన మనోభావాల వలన ఈ సమస్య రావచ్చు. రకరకాల సమస్యల వలన మానసిక సంఘర్షణకు లోనౌతారు. మనసులో అణచబడి వున్న ఉద్రేకం, ఆందోళనలు ఈ శారీరక లక్షణాలతో బయటపడతాయి. సైకియాట్రిస్టును కలిసి మందులు వాడుతూ కౌన్సిలింగ్, సైకోథెరపి, బిహేవియర్ థెరపి తీసుకోండి. తద్వారా మంచి ఫలితాలను సాధించవచ్చు.

చిన్నారి చిత్రకారులు

ఏ. వెంకట సాయి కుమార్,
7వ తరగతి,
ప్రగతి బాల విధ్యాలయం, తాడేపల్లి గూడెం.

ఎన్. వెంకట బాల మురళీ కృష్ణ,
3వ తరగతి. పెద్దాపురం.

డి. శివనాగ మల్లేశ్వరరావు, 7వ తరగతి,
ప్రగతి బాల విద్యాలయం, సుందరయ్య నగర్,
తాడేపల్లి.

లెక్క చేద్దామా!

పిల్లలూ... ఇక్కడ ఇచ్చిన పజిల్లో కొన్ని తీసివేతలు ఉన్నాయి. అయితే పక్కనే ఒకటి నుండి ఏడు వరకు అంకెలు కూడా ఉన్నాయి. వీటిలో ప్రతి అంకెను ఒక్కసారి మాత్రమే ఉపయోగించి అక్కడ ఉన్న పజిల్‌ను పూర్తి చేయాలి.ఎక్కువ సమయం తీసుకోకూడదు మరి.



జవాబు :- 14-5 =9, 10-5=5, 9-3=6, 10-2=8, 8-4=4, 4-3=1, 10-3=7.

తప్పులేవి?

ఇక్కడ కనిపిస్తున్న బొమ్మలో కొన్ని తప్పులున్నాయి. అవేంటో టకటకా చెప్పేయండి.



జవాబు : తిరగ బడిన ఫోటో , విరిగిన కర్టెన్ రాడ్, గొళ్లెం పెట్టని పెట్టె, సగం లేని కుడి కాలి ఫ్యాంట్, ఎడమ చేతి చొక్కా

కనిపెడదాం

నేస్తాలూ... ఇక్కడ కనిపిస్తున్న ప్రాణులన్నీ సముద్ర జాతికి చెందినవి. ఒక్కటి మాత్రం వేరే జాతికి చెందినది. అదేమిటో చిటికెలో చెప్పేయాలి.



రంగులు వేద్దాం

నేస్తాలూ... ఇక్కడ మంచి బొమ్మ కనిపిస్తోంది కదూ! మరి దానికి రంగులు వేసి అందంగా తయారు చేద్దామా.

చక్కని బొమ్మ చేద్దాం

ఫ్రెండ్స్... ఇక్కడ ఉన్న బొమ్మను చూశారా! దీన్ని చూస్తోంటే అంతా తికమకగా ఉంది కదూ. అదే మరి... ఊరికే చూడటం కాదు. ఏ క్రమంలో అమర్చితే ఆ బొమ్మ సరిగా వస్తుందో చూడండి. తర్వాత, పక్కన ఇచ్చిన గళ్లలో వరుసగా అంకెలు వేయాలి.



జవాబు: 1, 3, 2, 5, 4

నీడ ఎవరిది?

ఇక్కడ కనిపిస్తున్న నాలుగు బొమ్మల్లో ఒకటి నీడని తెలుస్తుంది కదూ. ఆ నీడ ఎవరిదో చిటికెలో చెప్పేయాలి.

ఎం.కె.ఆర్



బిలియన్ డాలర్ బేబీస్

అమెరికన్ బకాసురులకు పెట్టిన ముద్దు పేరు బిలియన్ డాలర్ బేబీస్. మచ్చుకు మనకు తెలిసిన లాక్ హీడ్, బోయింగ్, నార్త్ రాప్, గ్రూమన్, హాలీబర్టన్, బిపి, షెల్, జనరల్ డైనమిక్స్, రేథాన్ కంపెనీల యాజమాన్యాన్ని చెప్పకోవచ్చు. ప్రపంచ దేశాలపై దాడి చేసేందుకు బడ్జెట్ ఖర్చు పెంచేలా ఒత్తిడి చేసేది ఈ కంపెనీలే. ఇందుకోసం అమెరికా చేస్తున్న ఖర్చు గురించి చెప్తే ఎవరూ నమ్మరు. లక్షల కోట్లలో వుంటుంది. ఆ పచ్చినిజాలను ఈ వారం అట్టమీది కథలో అక్షరరూపంలో మీకందిస్తున్నాం.

ఐసెన్ హోవర్, అమెరికాకు రెండు సార్లు అధ్యక్షుడిగా పని చేసిన వ్యక్తి. రెండవ ప్రపంచ యుద్ధంలో ఐరోపాపై దాడికి నాయకత్వం వహించిన మిలిటరీ కమాండర్. 'రెండవ ప్రపంచ యుద్ధం, కొరియా యుద్ధంలో పని చేసిన సైనికులంగా మనం శాశ్వత ఆయుధ పరిశ్రమలను నెలకొల్పాల్సి వచ్చింది. అయితే ఇదే సమయంలో వాటి తీవ్ర పర్యవసానాలను గ్రహించటంలో మనం విఫలం కాకూడదు. మిలిటరీ-పరిశ్రమల వ్యవస్థ అవాంఛనీయ ప్రభావానికి మనం తెలిసిగాని తెలియకగానీ గురికాకుండా అప్రమత్తంగా ఉండాలి.' అని 1961 జనవరి 17న తన పదవీ వీడ్కోలు ప్రసంగంలో హెచ్చరించారు.

ఇప్పటికి 47 సంవత్సరాలు గడిచింది. ఆ మిలిటరీ మేన్ తరువాత తరువాత అమెరికా గద్దెనెక్కిన పౌర పెద్దమనుషులెవరూ ఈ హెచ్చరికలను పట్టించుకోలేదు. ఇరాక్‌లో సద్దాం హుస్సేన్ మారణాయుధాలు దాచారంటూ వాటిని వెతికి పట్టుకొని ప్రపంచాన్ని రక్షించే పేరుతో ఆ దేశంపై దాడి చేసి ఆక్రమించి కూర్చున్నారు. ఆల్ ఖైదా తీవ్రవాదులు ఆఫ్ఘనిస్తాన్‌లో ఉన్నారని, వారికి అక్కడి తాలిబాన్లు మద్దతు ఇస్తున్నారనే నెపంతో దాన్ని తమ ఆధీనంలోకి తెచ్చుకున్నారు. ఇప్పుడు ఇజ్రాయెల్‌కు ఇరాన్‌నుంచి ప్రమాదం ఉందని ఒకవైపు ఇరాన్‌లో అణ్వాయుధాలను తయారు చేస్తున్నారని మరోవైపు చెబుతూ దానిపై దాడి చేసేందుకు సిద్ధం అవుతున్నారు. ఇన్ని దుర్మార్గాలకు పాల్పడితే బుష్‌కేం ఒరుగుతుందని ఎవరైనా అనుకోవటం సహజం. రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో ఏర్పడిన మిలిటరీ పరిశ్రమలు బకాసురుడి ఒక కొమ్మయితే తరువాత మొలిచింది రెండో కొమ్ము. అదే మిలిటరీ-పెట్రోలియం. ఒక దేశం తరువాత మరొక దేశాన్ని తమకు ఆహారంగా అందించాలని డిమాండ్ చేస్తున్నాయి. బుష్ వంటి దుర్మార్గులు పచ్చి అబద్ధాలు చెప్పి ఒక్కొక్క దేశాన్ని వరుసగా వాటికి అప్పగిస్తున్నారు.

అమెరికన్ బకాసురులు

'ఇది నిజమా' అని 'అలా ఎందుకు చేస్తారులే' అనీ ఎవరైనా అనుకుంటే చేయగలిగింది లేదు. అమెరికన్ బకాసురులకు పెట్టిన ముద్దు పేరు బిలియన్ డాలర్ బేబీస్.మచ్చుకు మనకు తెలిసిన లాక్‌హీడ్, బోయింగ్, నార్త్‌రాప్ గ్రూమన్, హాలీబర్టన్, బిపి, షెల్, జనరల్ డైనమిక్స్, రేథాన్ కంపెనీలు వీటిలో ఉన్నాయి. బేబీలంటే ఇవి ఏదో చిన్న కంపెనీలనుకుంటున్నారా? అమెరికా ప్రపంచ దేశాలపై దాడులు చేసేందుకు ఏడాదికి చేస్తున్న బడ్జెట్ ఖర్చు గురించి వింటే నిజంగా ఎవరూ నమ్మరు. ఈ ఏడాది 515 బిలియన్ డాలర్లు కాగా 2009లో అక్షరాలా 541 బిలియన్ డాలర్లు. ఇవిగాక అనుబంధ పద్దుల రూపంలో మరికొన్ని బిలియన్ డాలర్లు కేటాయిస్తారు. వచ్చే ఏడాది ఒక్క ఇరాక్ యుద్ధానికే వంద బిలియన్ డాలర్లు ప్రత్యేకంగా కేటాయించాలని కూడా కోరుతున్నారు. ఈఏడాది అమెరికా బడ్జెట్ మూడులక్షల కోట్ల డాలర్లయితే అన్ని రకాల మిలిటరీ సంబంధ ఖర్చు ఒక లక్ష కోట్ల డాలర్లని అంచనా.

బడ్జెట్ వేల కోట్లలోనే

మన ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి మన రాష్ట్ర బడ్జెట్ లక్ష కోట్లని సగర్వంగా చెప్పుకున్నారు. ఒక బిలియన్ డాలర్లంటే వంద కోట్ల డాలర్లు. కోటి డాలర్లు అంటే ఇప్పటి రూపాయి మారకం



'ఎవర్ గ్రీన్ ఇంటర్నేషనల్ ఎయిర్‌లైన్స్' సి.ఇ.ఓ డెఫోర్డ్ ఎం. స్మిత్

విలువ ప్రకారం 42 కోట్ల రూపాయలు. ఈ లెక్కన ఒక బిలియన్ అంటే 4,200 కోట్ల రూపాయలు. మన రాష్ట్ర బడ్జెట్‌ను బిలియన్ల భాషలో చెప్పుకోవాలంటే 24 బిలియన్ డాలర్లకు సమానం. అమెరికా దాడుల ఖర్చు 541 బిలియన్ డాలర్లు అంటే 23 ఆంధ్రప్రదేశ్‌ల బడ్జెట్‌కు సమానం. అమెరికా చేస్తున్న దుర్మార్గాల ఖర్చు ఇది. దీన్ని మంచి పనులకు వినియోగిస్తే..... ఇక చెప్పాల్సిందే ముంటుంది. మనం ఇక్కడ రాయాల్సిన అవసరమే ఉండేది కాదు. ఇంత బడ్జెట్‌ను ఉఫ్‌మని ఊదేస్తున్న కంపెనీల గురించి, అవి యుద్ధాలు దాడులను ప్రోత్సహిస్తున్న దుర్మార్గాల గురించి అమెరికా మీడియాలో, అదే విధంగా ప్రపంచ మీడియాలో పెద్దగా వార్తలు రావు. ఎందుకంటే వాటిని మేనేజ్ చేసేందుకు మరి కొన్ని బిలియన్ డాలర్లు ఖర్చు పెడతారు కనుక. అమెరికా రక్షణ శాఖకు ఆయుధాలు, మిలిటరీ సేవలను అందించే బిలియన్ డాలర్ బేబీస్‌లో లాక్‌హీడ్ పెద్దది. గతేడాది 28 బిలియన్ డాలర్లు పొందింది.

ఇలాంటి కంపెనీల వివరాలు, వాటి వెనుక ఉన్న వ్యక్తుల గురించి వాటి పత్రాలలో మాత్రమే కనిపిస్తాయి.

ఉదాహరణకు మాక్ ఆండ్రూస్ అండ్ ఫోర్బ్స్ హోల్డింగ్ కంపెనీని తీసుకోండి. గతేడాది అమెరికా రక్షణ శాఖనుండి ఇది పొందిన మొత్తం 3,360 కోట్ల డాలర్లు. మనందరికీ తెలిసిన రెవలాన్, పానావిజన్ వంటి అనేక కంపెనీలు దీనికి ఉన్నాయి. సౌందర్యసాధనాల మొదలు లక్షలాది మందిని వికలాంగులను గావించి రూపురేఖలనే మార్చివేసే మిలిటరీ ఆయుధ వాహనాలను కూడా ఇదే కంపెనీ తయారు చేస్తుంది. అలాంటి మారణాయుధ వాహనాలు 50 దేశాలకు ఎగుమతి అయ్యాయి. నిజానికి ఇది ఆవగింజలో అరవయ్యవవంతు మాత్రమే. దీని అనుబంధ కంపెనీ ఎఎం జనరల్ కార్నెజి మిలన్ విశ్వవిద్యాలయానికి నిధులిచ్చి గగనతలం నుంచి యుద్ధాలను చేసే రోబోట్ల తయారీకి పూనుకుంది. అంతేకాదు ఈ కంపెనీ ఇరాక్‌పై దాడి చేస్తున్న అమెరికన్ సైనికులకు సేవలనందించేందుకు తన సిబ్బందిని కూడా అక్కడకు పంపింది. ఇలాంటి వారిని అమెరికా తన లెక్కల్లో చూపదు.



'హారిస్ కార్పొరేషన్' సి.ఇ.ఓ హోవార్డ్ ఎల్. లారికా





'డిఆర్ఎస్ టెక్నాలజీస్' సి.ఇ.ఓ ఫ్రెడ్ ఎల్. మారియన్

డిఆర్ఎస్ ... మరో డాలర్ బేబీ

మరో కంపెనీ డిఆర్ఎస్ టెక్నాలజీస్. దీనికి దక్కిన వాటా 1,791 కోట్ల డాలర్లు. ఇది వియత్నాం దురాక్రమణ, దాడిలో కూడా సేవలందించింది. ఒకేసారి వేలాది మందిని మట్టుపెట్టే ఆధునిక టాంకుల మొదలు ఎఫ్ 15,16 యుద్ధ విమానాలు, సబ్‌మెరైన్‌లు, యుద్ధ నావలు తయారు చేస్తుంది. ఫిచ్ రేటింగ్స్ అనే ఏజెన్సీ దీని గురించి రాస్తూ ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్ దాడుల నుంచి డిఆర్ఎస్ టెక్నాలజీస్ లాభపడిందని పేర్కొన్నది.

అంతర్జాతీయ కమ్యూనికేషన్స్, ఐటి కంపెనీగా తెలిసిన హారిస్ కార్పొరేషన్ పెంటగాన్ నుంచి 1,501 కోట్ల డాలర్లు పొందింది. నూట యాభై దేశాలకు ఇది ఆయుధాలను సరఫరా చేస్తున్నది. ఇరాక్‌లోని బాగ్దాద్,ఇతర నగరాలను 3డి ఫార్మాట్‌లో చిత్రించి సైన్యం ఎలా దాడులు చేయాలో ఎలా వెనక్కు రావాలో సూచించే సాఫ్ట్‌వేర్‌ను అందచేసింది.

ఇంకో కంపెనీ నేవీ స్టార్ డిఫెన్స్. దీని వాటా 1,166 కోట్ల డాలర్లు. మొదటి ప్రపంచ యుద్ధ కాలం నుంచి ఇది ఆయుధాలను తయారు చేస్తున్నది. దీని ప్రత్యేక రవాణా వ్యవస్థల నిర్వహణ, పరిష్కారాలు. ఇరాక్‌లో అమెరికన్లకు వ్యతిరేకంగా రోడ్లపై నాటిన మందు పాతరల నుంచి రక్షణ పొందే వాహనాలను తయారు చేసి అందచేసింది.

పేరు చూస్తే వ్యవసాయ రంగానికి చెందినదిగా పొరబడే మరో కంపెనీ ఎవర్ గ్రీన్ ఇంటర్నేషనల్ ఎయిర్‌లైన్స్. దీనికి దక్కిన కాంట్రాక్టుల విలువ 1,105 కోట్ల డాలర్లు. పైకి కొన్ని వ్యవసాయ, నర్సరీ, ద్రాక్షసారా వంటి వాటిని తయారు చేస్తున్నది. అసలు వ్యాపారం మాత్రం అమెరికా విదేశీ దాడులకు అవసరమైన సేవలనందించటమే. అందుకు గాను దాదాపు 200 అవార్డులు కూడా పొందింది. సైనికులు, ఆయుధాలను అత్యంత వేగంగా అనుకున్న ప్రదేశాల్లో విమానాల ద్వారా దింపగల దిట్ట. ఇరాక్ ఆక్రమణలో దీని పాత్ర గురించి చెప్పనవసరం లేదేమో ! అమ్నెస్టీ ఇంటర్నేషనల్ 2006 నివేదిక ప్రకారం ఎవర్ గ్రీన్ కంపెనీ అమెరికాకు అనుకూలంగా యుద్ధ వార్తలను రాయించేందుకు

సింహం- నక్కలు

అమెరికా దుర్మార్గాలకు ఐరోపాలోని దేశాలెందుకు వంతపలకాలన్నది చాలా మందికి వచ్చే సందేహం. ప్రపంచాన్ని ఆక్రమించుకోవటంలో ముందున్నది ఐరోపా ధనిక దేశాలు (ఆ మాటకు వస్తే అమెరికాను ఆక్రమించింది ఐరోపావాసులే). రెండు ప్రపంచ యుద్ధాల్లో ఐరోపా ధనిక దేశాలు అనేక రకాలుగా దెబ్బతినటమే కాదు, వాటి వలసదేశాలన్నింటినీ పోగొట్టుకున్నాయి. ఆ స్థితిలో అమెరికాలో అవతరించిన ధనిక వర్గం ఐరోపా, జపాన్ వంటి దేశాలకు పెట్టుబడులు పెట్టి పెద్దన్న పాత్ర వహించింది.దాంతో అమెరికా సింహంలా మారగా అది మిగిల్చిన ఎముకలకోసం ఆశపడే నక్కలుగా ఐరోపా ధనిక దేశాలు తయారయ్యాయి. అందుకే అమెరికా ఎక్కడ దాడి చేస్తే అక్కడ అవి కూడా తమ వంతు పాత్ర వహిస్తాయి. వచ్చిన లాభాలను పంచుకుంటాయి. అందుకు ఉదాహరణ చూడండి. ఐరోపాలో ఫ్రాన్స్‌కు చెందిన బహుళజాతి గుత్త సంస్థఈడ్స్ గ్రూప్. ఇది అమెరికా కంపెనీ నార్త్‌రాప్ గ్రుమమ్‌తో కలిసి తాజాగా 350 కోట్ల డాలర్ల విలువగల మిలిటరీ విమానాల కాంట్రాక్టును అమెరికా నుంచి పొందాయి.వీటికి వందబిలియన్ డాలర్ల విలువగల టాంక్‌లను సరఫరా చేసే కాంట్రాక్టును కట్టపెడుతున్నారు. పెంటగన్(అమెరికా రక్షణశాఖ) నిర్ణయాన్ని అధికారపక్ష పార్లమెంట్ సభ్యుడు శామ్ బ్రౌన్‌బాక్ విమర్శించాడు. అమెరికా కంపెనీ బోయింగ్‌కు ఇవ్వకుండా పెద్ద కుట్ర జరిగిందని వార్తలు వచ్చాయి. ఏదో ఒకసారి ఈ కాంట్రాక్టు బయటి కంపెనీలకు పోయిందని సరిపెట్టుకోవటం గాక ఐరోపా కంపెనీలు తమ మార్కెట్‌లో అడుగుపెట్టాయని బోయింగ్ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ పరిణామం రానున్న రోజుల్లో బహుళజాతి గుత్త సంస్థల మధ్య తీవ్రం కానున్న పోటీకి నిదర్శనంగా చెప్పవచ్చు.

ఫాక్స్‌న్యూస్ సిబ్బందిని ఇరాక్, కువైట్‌లకు చేర్చింది. ఇలాంటి దుర్మార్గ వ్యాపారాలు, ఆయుధాలు తయారు చేసే కంపెనీలెన్నో ఉన్నాయి. వీటికి ప్రపంచంలో ఎక్కడో ఒకచోట రక్తపాతం జరగకపోతే రోజు గడవదు. ఒక్క డాలర్ లాభం తగ్గినా ఎక్కడో ఒకచోట దాడి చేయించి దాన్ని పూడ్చుకొనేందుకు ప్రభుత్వాలపై వత్తిడి తెచ్చి తమ అభిమతాన్ని నెరవేర్చుకుంటాయి. వీటిలో కోకా-కోలా, డ్రాఫ్ట్, డెల్ వంటి కంపెనీలు కూడా తమ వంతు పాత్ర నెరవేరుస్తూ రక్తపు కూటిని పంచుకుంటున్నాయి. ఇరాక్ యుద్ధ చరిత్రను నిష్పాక్షికంగా ఎవరైనా రాస్తే ఈ కంపెనీల పాత్రకు పెద్ద పీట వేయాల్సిందే.

ఇన్ని వివరాలు తెలుసుకున్న తరువాత ప్రపంచాన్ని ఏలుతున్నదెవరో, ఏలుబడి ఎలా ఉండాలని శాసిస్తున్నదెవరో ఇంకా చెప్పాలా? కానీ విచారకరమైన అంశమేమంటే ఈ ప్రశ్నలను అడిగినపుడు అత్యధిక మంది నుంచి వచ్చే సమాధానాలు ఫూలిష్‌గా ఉంటాయి.

తర్వాత... తీరు మారింది

రెండవ ప్రపంచ యుద్ధానికి ముందు అమెరికా, ఇతర పెట్టుబడిదారీ ప్రపంచాన్ని ఆవహించిన తీవ్ర మాంద్య సమయంలో అమెరికాలో పనులు కల్పించింది ఆయుధ పరిశ్రమలే కావటంతో అక్కడి జనంలో వాటిపట్ల పెద్ద వ్యతిరేకత రాకపోవటం సహజం. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత మిలిటరీ-పరిశ్రమల తీరు మారింది. ప్రపంచ దేశాలపై కన్ను వేయటానికి, గూఢచర్యం జరపటానికి కూడా ఈ పరిశ్రమలకు అమెరికా ప్రభుత్వం అనుమతించింది. టిమ్ షోరోక్ అనే జర్నలిస్టు ఈ అంశాలపై పరిశోధన జరిపాడు. ఆయన రాసిన ప్రకారం 2006లో అమెరికా విదేశాల్లో నిఘా వేయటానికి చేసిన ఖర్చు 42 బిలియన్ డాలర్లు. ఇదంతా అవుట్ సోర్స్ పేరుతో బిలియన్ డాలర్ బేబీస్ కంపెనీలకు కట్టపెట్టిన సొమ్ము. మరో 20 బిలియన్ డాలర్ల సొమ్మును తన జనంపై నిఘావేసేందుకు అమెరికా ఇలాంటి కంపెనీల సేవలకు చెల్లించింది. ఇలాంటి నిఘా సమాచారం, ఫొటోలను నిల్వ చేసేందుకు నాసా 2001లో 144 కంపెనీలను వినియోగిస్తే 2006 నాటికి వాటి సంఖ్య 5,400కు పెరిగింది.



'మాక్ ఆండ్రూస్ అండ్ ఫోర్బ్స్ హోల్డింగ్ '
సి.ఇ.ఓ రొనాల్డ్ పెర్లిమాన్

అయితే ఈకంపెనీలు అందించే నిల్వచేసే సమాచారంలో 95శాతం చూడకుండానే ధ్వంసం చేస్తున్నారు. ఎందుకంటే వాటిని విశ్లేషించే యంత్రాంగం లేదు. ఇలాంటి అవుట్ సోర్సింగ్ కారణంగా ఏ విదేశమైనా అమెరికా మిలిటరీ, ప్రభుత్వ రహస్యాలను తెలుసుకోవటం చాలా సులభమని కూడా ఆ జర్నలిస్టు పేర్కొన్నాడు. ఇలాంటి అవుట్ సోర్సింగ్ కంపెనీ నుంచి గతంలో ఆస్ట్రేలియా ప్రధానిని పదవి నుంచి తొలగించాలన్న అమెరికా రహస్య నిర్ణయం బయటకు పొక్కింది. అంతే కాదు అనేక రహస్యాలను నాటి సోవియట్ యూనియన్ ఇలాగే పొందింది. ఇప్పుడు బ్లాక్ వాటర్ అనే ప్రైవేటు కంపెనీకి గూఢచారుల నిర్వహణ బాధ్యతను అప్పగించారు. ఇది ఎంతవరకు పోయిందంటే ప్రభుత్వ గూఢచార సంస్థలైన సిఐఏ, డిఐఏ, ఎన్ఎస్ఏ సిబ్బంది అసలు తామేమి చేయాలో తెలియని అయోమయంలో పడిపోయారని కొందరు విమర్శకులు పేర్కొన్నారు. ❄



'నేవీ స్టార్ డిఫెన్స్' సి.ఇ.ఓ మసికోట్



చేప కుర్మా

కావలసిన పదార్థాలు

చేపలు- అరకిలో, ఉప్పు -రుచికి సరిపడ, కారం- రెండు స్పూన్లు పచ్చిమిరపకాయలు- మూడు, ఉల్లిపాయలు-రెండు, లవంగాలు- అయిదు, వెల్లుల్లి- అయిదు రెబ్బలు, యాలకులు- నాలుగు ధనియాలు- ఒక స్పూను, దాసిన చెక్క- రెండు ముక్కలు నూనె- 100 గ్రాములు, కొత్తిమీర- ఒక కట్ట పెరుగు- ఒక కప్పు, పసుపు- చిటికెడు

తయారు చేసే విధానం

చేపలను శుభ్రంగా చేసుకొని ముక్కలుగా కోసుకొని ఉంచుకోవాలి. ఉప్పు-వెల్లుల్లి-అల్లం-కారం బాగా నూరుకొని ఈ మిశ్రమాన్ని చేపలకు పట్టించాలి. ఒక కప్పు పెరుగును అందులో వేసి మూత పెట్టండి. ఉల్లిపాయలు-పచ్చిమిర్చి- కొత్తిమీరను విడివిడిగా ముక్కలు చేసుకోవాలి. ధనియాలు-వెల్లుల్లి బాగా నూరి ముద్ద చేసుకోండి. ఒక బాణలిలో నూనె పోసి బాగా కాగాక పెరుగులో కలిపి ఉంచిన చేప ముక్కలు వేయాలి. అయిదు నిమిషాలు పోయాక మసాలా ముద్ద, ఉల్లి-పచ్చిమిర్చి ముక్కలు వేసి బాగా కలియబెట్టండి. కుర్మా తయారవగానే కొత్తిమీర వేసి దింపేయాలి.

ఆలు పరోటా (బంగాళదుంపతో రొట్టె)

కావలసిన పదార్థాలు

బంగాళదుంపలు- 1/4 కిలో (ఒక మోస్తారు సైజువి), పచ్చిమిర్చి- 2 (సన్నగా తరిగినవి), అల్లం- చిన్న ముక్క గోధుమపిండి- 1/4 కిలో నూనె- 50 గ్రాములు, నెయ్యి- 50 గ్రాములు, ఉప్పు- తగినంత కొత్తిమీర- సన్నగా తరిగింది, పసుపు-చిటికెడు

తయారు చేసే విధానం

ముందుగా బంగాళదుంపలు శుభ్రం చేసి కుక్కర్లో పెట్టి మెత్తగా వుడికించుకోవాలి. గోధుమపిండి జల్లించి దానిలో, వేసి చేసిన నూనె కొంచెం పోయాలి. ఉడికించిన బంగాళదుంపలు పొట్టు తీసి, మెత్తగా క్రష్ (మెత్తగా పిసికి) చేయాలి. దాంతో పాటు తరిగిన కొత్తిమీర, పసుపు, ఉప్పు, మిర్చి ముక్కలు, నూరి పెట్టుకున్న అల్లం వేసి పిండిని చపాతీ పిండిలా కలపాలి. ఇప్పుడు కలిపి వుంచుకున్న గోధమపిండితో నూనె, నెయ్యి వేసి ఆలు చపాతీలు చేయాలి. వీటిని సన్నటి సెగలోనే కాల్చాలి. చపాతీలు చేసేటప్పుడు పీటకు అంటుకోకుండా వుండటానికి బియ్యంపిండి వాడితే బాగా వస్తాయి. ఈ చపాతీలు వేడిగా బాగుంటాయి. ఆలు వుంది కాబట్టి చట్నీతో గాని, పప్పుతో గాని తింటే బాగుంటాయి. కాప్సికమ్, క్యారెట్‌తో పువ్వులా కట్‌చేసి వెజిటబుల్ ఫ్లవర్స్‌తో, టొమోటా ఫ్లవర్‌తోగాని టేబుల్ పైన అమరిస్తే పెద్దల విషయం ఎలా వున్నా పిల్లలు బాగా ఇష్టంగా తింటారు.

తోటకూర పకోడీలు

కావలసిన పదార్థాలు

తోటకూర-1కట్ట చిన్నది, పచ్చిమిర్చి- 4 సన్నగా తరిగినవి, శనగపిండి- 150 గ్రాములు, ఉప్పు-తగినంత, కారం-1/2 చెంచా, పసుపు-1/4 చెంచా, నూనె- 250 గ్రాములు (వేయించటానికి వీలుగా) అల్లం- ఒక చిన్న ముక్క (సన్నగా తరగాలి)

తయారు చేసే విధానం

ముందుగా నీళ్లల్లో శుభ్రం చేసుకున్న కూరని చాలా సన్నగా తరుక్కోవాలి. శనగపిండి జల్లించి అందులో కారం, ఉప్పు పసుపు కలిపి, ఆపైన తరిగి ఉంచుకున్న కూర, మిర్చి అల్లం వేసి బాగా కలపాలి. ఇప్పుడు స్టవ్ మీద బాండీ వుంచి, పకోడీలు వేయించటానికి వీలుగా నూనె పోసుకోవాలి. కాగిన నూనె ఒక చిన్న గరిటెతో తీసుకొని, కలిపి వుంచుకున్న శనగపిండి మిశ్రమం మీద గుమ్మరించాలి. వేడి చల్లారాక, పిండి మొత్తం కలపాలి. మరీ పొడిగా వుంటే కొంచెం నీళ్ళు తడి చేసుకుంటూ, పకోడీల్లా నూనెలో వేయాలి. బాగా రంగు వచ్చాక పేపర్ టవల్స్ వున్న పళ్లెంలోకి తీసుకోవాలి. టొమేటో సాస్‌తో తింటే రుచిగా వుంటుంది.



హమ్మస్

కావలసిన పదార్థాలు

కాబూలీ శెనగలు-1 కప్పు (ఉడికించినవి)
వేయించిన తెల్లని నువ్వు పప్పు- 1/4 కప్పు
వెల్లుల్లి ముక్కలు- 1/2 చెంచా
నిమ్మరసం- 11/2 చెంచా
కారం- 1/4 చెంచా
కొత్తిమీర తరుగు- 3 చెంచాలు
ఆలివ్ ఆయిల్- కొంచెం

తయారు చేసే విధానం

నువ్వు పప్పు, వెల్లుల్లి, ఉప్పు, నిమ్మరసం, శనగలు ...అన్నింటిని కలిపి ఒక గిన్నెలో వేసి బాగా కలపాలి. తర్వాత ప్లేట్లలోకి సర్ది పైన ఆలివ్ ఆయిల్ వేసి కొత్తిమీర చల్లి అందించాలి. వర్షం పడినప్పుడు తింటే సూపర్‌గుంటుంది.

(లెబనీస్ వంటకం)

కథ

లాకౌట్

సరిదే నాగేశ్వరరావు

ఈలోగా కార్మికులపై లాఠీఛార్జీకి నిరసనగా పట్టణంలో బంద్ నిర్వహించారు. ఫ్యాక్టరీ మూసివేత ఫలితంగా పరోక్షంగా దెబ్బతిన్న చిన్న చిన్న వర్తకులు, కార్మికులు బంద్‌లో స్వచ్ఛందంగానే పాల్గొన్నారు. మిగిలిన వాళ్లు ఇదేమీ పట్టించుకోలేదు. సినిమా థియేటర్లు మామూలుగానే పనిచేశాయి. గవర్నమెంటు స్కూళ్లు మూసేసినా ప్రయివేటు కాన్వెంట్లు మాత్రం యథాతథంగానే పనిచేశాయి. బస్సులు తిరిగాయి... షాపింగ్ కాంప్లెక్సులూ పనిచేశాయి. రాజారావు ఇంట్లో పొయ్యి మాత్రం రాజుకోలేదు. ఆ మాటకొస్తే.. ఆరోజే కాదు వారం రోజుల నుండి ఆ ఇంట్లో పొయ్యిలో పిల్లి కదలలేదు. ఒక్క రాజారావే కాదు ఫ్యాక్టరీ కార్మికుల ఇళ్లలో చాలా వరకు ఇదే పరిస్థితి. అప్పటికే కొంత మంది కార్మికులు ప్రత్యామ్నాయ పనుల్లో కుదిరిపోయారు. తాపీపని, మామిడి తాండ్ర, పల్లీలు అమ్మడం, వ్యవసాయ పనులు, చివరికి రిక్షా తొక్కే పనిలోనూ ఫ్యాక్టరీ కార్మికులే.

'అక్రమ లాకౌట్ ఎత్తేయాలి... జీతాల బకాయిలు చెల్లించాలి... రైతుల బకాయిలు చెల్లించాలి...' కార్మికుల నినాదాలు మిన్నంటుతున్నాయి.

పిఠాపురం షుగర్ ఫ్యాక్టరీ ముందు కార్మికులు తమ కుటుంబాలతో సహా ధర్నా చేస్తున్నారు... పరిస్థితి ఉద్రిక్తంగా ఉంది. కార్మికులు ఆవేశంగా నినదిస్తున్నారు. తమ ఉపాధి దూరమౌతోందన్న కసి వారి కంఠ నరాలను ఉబ్బిస్తోంది. రేపటి నుండి తమ కుటుంబాలు వీధిన పడతాయన్న ఆవేదన వారి గొంతులో ప్రతిధ్వనిస్తోంది. ఆడా...మగా.... పిల్లా...పీచూ... ముసలీ....ముతకా... అందరూ ఫ్యాక్టరీ ముందే ఉన్నారు. పరిస్థితి అర్థం అయిన పెద్దలు రేపటి భయంతో అరుస్తుంటే.... ఏమీ తెలీని పసివాళ్ళు సైతం కీచుగొంతులతో శృతి కలుపుతున్నారు...

గుమిగూడిన కార్మికుల ముందు రాజారావు శివం తొక్కుతున్నాడు. రేపటి నుంచి ఆ ఫ్యాక్టరీతో తనకు రుణం తీరుతోందన్న సత్యం ఒక్కటే అతనికి జ్ఞాపకం ఉంది. ఏలాగైనా తన హక్కును కాపాడుకోవాలని ఈ అన్యాయాన్ని ఎదిరించాలని ఆవేశంతో ఊగిపోతున్నాడు. కుటుంబ భవిష్యత్తు తన కళ్ళముందే బూడిదవుతుందనే నిజం అతనికి మింగుడు పడడం లేదు.

'నాన్నా! సెకండ్ సెమిస్టర్‌కు ముందే ఫీజు కట్టాలి... లేదంటే పరీక్ష రాయనివ్వనని ప్రిన్సిపాల్ చెప్పాడు...' ఆ ఉదయమే ఇంజనీరింగ్ చదువుతున్న తన పెద్ద కొడుకు చెప్పిన మాటలు చెవిలో మారుమోగుతున్నాయి..

'ఆ ఫ్యాక్టరీ గొడవేదో తేలిపోగానే ఒకసారి అమలాపురం వెళ్లి రండి... రంగారావు గారి సంబంధం మన అరుణకి సరిపోతుందని పేరయ్యగారు చెప్పారు... మర్చిపోకండి' ఫ్యాక్టరీకి వస్తుంటే తన భార్య సీత చేసిన హెచ్చరిక చెవిలో గింగురుమంటోంది.

తన రోగాన్ని సైతం పక్కన పెట్టి సీత ఎప్పుడూ కన్న కూతురు పెళ్ళి కోసమే ఆందోళన పడుతుంది పిచ్చిది. 'ఈ సారి ఎలాగైనా ప్రావిడెంట్ ఫండ్ లోన్ తీసుకుని దానికి ఆపరేషన్ చేయించాలి' ఇలా అనుకోవడం ఇప్పటికి వందోసారి.

రాజారావుకి ఫ్యాక్టరీతో వున్న అనుబంధం ఈనాటిదికాదు. రాజారావుకంటే ముందు అతని తండ్రి రంగారావు ఆ ఫ్యాక్టరీలో ఫోర్‌మెన్‌గా పనిచేసేవాడు. ఇకసారి బ్రాయిలర్‌పై పని చేస్తూ ప్రమాదవశాత్తు పైనుండి పడి చనిపోయాడు. అతని స్థానంలో రాజారావుకు ఫ్యాక్టరీలో ఉద్యోగం వచ్చింది. అప్పటి నుండి నిబద్ధతతో పనిచేస్తూ ఫ్యాక్టరీనే దేవాలయంగా భావిస్తూ వచ్చాడు. ఆస్తులు కూడబెట్టుకోలేకపోయినా ఆ ఉద్యోగం ఆధారంగానే తన కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అలాంటిది ఒక్కసారిగా ఫ్యాక్టరీ లాకౌట్ ప్రకటించేసరికి అతని కలలన్నీ కల్లలయ్యాయి. ఫ్యాక్టరీలో దాదాపు 400 మంది కార్మికులుంటే, అందరి పరిస్థితీ ఇదే. అప్పటికి ఆరు నెలలనుండి ఫ్యాక్టరీ యాజమాన్యం కార్మికులకు జీతాలు బకాయి ఉంది. ఉద్యోగాన్ని వదులుకోలేక, ఫ్యాక్టరీ యాజమాన్యంపై ఉన్న నమ్మకంతో కార్మికులు అప్పులు చేసుకుని జీవిస్తున్నారు. ఇవాళో, రేపో క్రష్షింగ్ పూర్తవుతుంది. యాజమాన్యం తమ జీతాల బకాయిలు చెల్లిస్తుందని అందరూ ఆశగా చూస్తున్న తరుణంలో ఫ్యాక్టరీ లాకౌట్ వారి పట్ల అశనిపాతమే అయింది. ఫ్యాక్టరీని నిలువునా కూల్చి ... ఆ స్థలాన్ని ప్లాట్లుగా చేసి వేల కోట్లు గడించాలన్న యాజమాన్యం అత్యాశకు కార్మికులు బలయ్యారు. కార్మికుల నినాదంతో ఈ లోకంలోకి వచ్చిన రాజారావు వారితో గొంతు కలిపాడు.

అప్పటి వరకు ఫ్యాక్టరీ లోపల కాచుకుని ఉన్న పోలీసులకు ఏ ఆదేశాలు అందాయో ఏమో... ఒక్కసారిగా లాఠీలతో కార్మికులపై విరుచుకుపడ్డారు. ఎస్ఐ శ్రీధర్‌కుమార్ తన వాళ్ళని చాకచక్యంగా కార్మికులపైకి ఉసిగొల్పుతున్నాడు. ఫ్యాక్టరీ

ఫ్యాక్టరీ ఒక పూపు ఊపిన ఫోర్‌మెన్ రంగారావు ఫ్యాక్టరీ స్థలం సమీపంలోనే కిళ్లీ కొట్టు నడుపుకుంటున్నాడు. చైన్‌మెన్ రామేశం పీచుమిఠాయి అమ్ముకుంటున్నాడు. ఫ్యాక్టరీ సమీపంలోనే వ్యాపారాలు అన్నీ మూతపడ్డాయి. ఇంజనీరింగ్ చదవాల్సిన రాజారావు కొడుకు కోటగుమ్మం సెంటర్లో సైకిల్ షాప్ నడుపుతున్నాడు. రాజారావు భార్య సీతకు ఆపరేషన్ కాలేదు. ఆమె గవర్నమెంట్ హాస్పటల్‌కు వెళ్లి వస్తూనే ఉంది. అతని కూతురుకి ఇంకా పెళ్లి కాలేదు. రాజారావు లేనిఫ్యాక్టరీకి ఇప్పటికీ వెళ్లి వస్తూనే ఉన్నాడు...

యజమాని రఘురామ్ ఇచ్చిన వందనోట్ల కట్ట అతని ఫ్యాంటు జేబులో కరుకుగా తగలడంతో రెట్టించిన ఉత్సాహంతో ఖాకీలను ముందుకు నడిపాడు. కార్మికులు తేరుకునే లోగానే వారిలో కొందరి తలలు పగిలాయి. పిల్లలు.. మహిళల రోదనలతో ఆ ప్రాంతం దద్దరిల్లింది. లాఠీ దెబ్బలు తట్టుకోలేక కార్మికులు పరుగులు తీశారు. పరిగెత్తలేని పిల్లలు, ఆడవాళ్లు పడుతూ... లేస్తూ.. లాఠీ దెబ్బలు తమ మీద పడిన ప్రతిసారి బాధగా అరవనారంభించారు. వారందరికీ ధైర్యం చెప్పబోయిన రాజారావుని పోలీసులు చుట్టుముట్టారు. లాఠీలతో, తుపాకీ బానెట్‌లతో అతనిపై విరుచుకుపడ్డారు. తనపై వర్షంలా పడుతున్న దెబ్బలకు అతను మెలికలు తిరిగాడు. తల పగిలింది.. పోలీసు బూటు ఇనుప నాడా తగిలి పక్కటెముక విరిగింది. రక్తం ధారకట్టింది... కళ్లముందు నల్లని శిల్కు తెరలు పడుతుండగా రాజారావు కళ్లు మూతలు పడ్డాయి. ఈలోగా పోలీసులు దొరికిన వాడిని దొరికినట్లు విరగ్గొట్టి అరెస్టు చేశారు. అంతా 20 నిమిషాల్లో పూర్తయింది. పోలీసుల దెబ్బలకు గాయపడిన వాళ్లు హాస్పటల్ పాలైతే అరెస్టు అయిన వాళ్లు జైళ్లపాలయ్యారు. తమ నేరం ఏమిటో తెలీకుండానే వారంతా నెల రోజులు సబ్‌జైల్లో గడిపారు.

ఈలోగా కార్మికులపై లాఠీఛార్జీకి నిరసనగా పట్టణంలో బంద్ నిర్వహించారు. ఫ్యాక్టరీ మూసివేత ఫలితంగా పరోక్షంగా దెబ్బతిన్న చిన్న చిన్న వర్తకులు, కార్మికులు బంద్‌లో స్వచ్ఛందంగానే పాల్గొన్నారు. మిగిలిన వాళ్లు ఇదేమీ పట్టించుకోలేదు. సినిమా థియేటర్లు మామూలుగానే పనిచేశాయి. గవర్నమెంటు స్కూళ్లు మూసేసినా ప్రయివేటు కాన్వెంట్లు మాత్రం యథాతథంగానే పనిచేశాయి. బస్సులు తిరిగాయి... షాపింగ్ కాంప్లెక్సులూ పనిచేశాయి. రాజారావు ఇంట్లో పొయ్యి మాత్రం రాజుకోలేదు. ఆ మాటకొస్తే.. ఆరోజే కాదు వారం రోజుల నుండి ఆ ఇంట్లో పొయ్యిలో పిల్లి కదలలేదు. ఒక్క రాజారావే కాదు ఫ్యాక్టరీ కార్మికుల ఇళ్లలో చాలా వరకు ఇదే పరిస్థితి. అప్పటికే కొంత మంది కార్మికులు ప్రత్యామ్నాయ పనుల్లో కుదిరిపోయారు. తాపీపని, మామిడి తాండ్ర, పల్లీలు అమ్మడం, వ్యవసాయ పనులు, చివరికి రిక్షా తొక్కే పనిలోనూ ఫ్యాక్టరీ కార్మికులే.

కార్మికులకు న్యాయం చేయాలని యూనియన్ నాయకులు నిరాహారదీక్ష చేపట్టారు. మొదటి రోజు శిబిరంలో పాతిక మంది వరకూ ఉన్నారు. ఏడోరోజు మాత్రం నలుగురే ఉన్నారు. పట్టణంలో ప్రధాన ఉపాధి వనరు అయిన ఫ్యాక్టరీ మూతకు నిరసనగా అఖిల పక్షం ఏర్పాటైంది. కమిటీలో స్థానిక ఎమ్మెల్యే దొర, మున్సిపల్ ఛైర్మన్ మూర్తి, 'అభ్యుదయ' నాయకుడూ ఇలా చాలా మందే ఉన్నారు. ఫ్యాక్టరీని తిరిగి తెరిపించటానికి ఏం చేయాలనే విషయం మీద నాలుగు దఫాలు చర్చలు జరిపారు. ఆవేశంగా ప్రసంగించారు. చివరికి రెండు పర్యాయాలు ఫ్యాక్టరీ యాజమాన్యంతో చర్యలు జరిపారు. ఫలితం... ఎమ్మెల్యే కొత్త సుమో కొనుక్కున్నాడు. ఛైర్మన్‌కు అదే ఫ్యాక్టరీ స్థలంలో ఈశాన్యం మూల ఒక ప్లాటు ఎలాట్ అయ్యింది. వివాదం పూర్తిగా నీరుకారింది.

యూనియన్ నాయకులకు డబ్బులు కావాల్సినప్పుడల్లా ఫ్యాక్టరీ లాకౌట్ గుర్తొస్తోంది... అంతో ఇంతో వారికీ 'పని' జరుగుతోంది... ఇదీమీ తెలీని రాజారావు ఫ్యాక్టరీ తెరుస్తారని, తమకు న్యాయంగా రావాల్సిన జీతాల బకాయిలు చెల్లిస్తారనీ, కొడుకుని ఇంజనీరింగ్ చదివించొచ్చనీ, కూతురి పెళ్లి చేయొచ్చని, తన భార్యకు ఆపరేషన్ చేయించొచ్చనీ ఇలా కలలు కంటూనే ఉన్నాడు... ఎమ్మెల్యే, ఛైర్మన్, యూనియన్ నాయకుల చుట్టూ తిరుగుతూనే ఉన్నాడు...

ఈలోగా ఫ్యాక్టరీలో యంత్రాలు ఒక్కటొక్కటిగా బయటకి తరలిపోయాయి.... ఇదేమిటని ప్రశ్నించిన వారికి కొత్త యంత్రాలు ఏర్పాటు చేయడానికని యజమాన్యం నమ్మబలికింది. దానికి అఖిల పక్షం సైతం వంతపాడడంతో కార్మికులు ఊరుకున్నారు.... ఫలితంగా ఇప్పుడు ఫ్యాక్టరీ స్థానంలో ఖాళీ స్థలం మిగిలింది. షుగర్ ఫ్యాక్టరీ బోర్డు స్థానంలోనే ఫ్లాట్ ఫర్ సేల్ బోర్డు వెలిసింది. ఫ్యాక్టరీ ఆవరణలో ముక్కచెక్కలైన స్థలం మిగిలింది. అక్కడే ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ సుదర్శనం తన అల్లుడి పేరున రెండు ప్లాట్లు తీసుకున్నాడు.

ఫ్యాక్టరీ ఒక పూపు ఊపిన ఫోర్‌మెన్ రంగారావు ఫ్యాక్టరీ స్థలం సమీపంలోనే కిళ్లీ కొట్టు నడుపుకుంటున్నాడు. చైన్‌మెన్ రామేశం పీచుమిఠాయి అమ్ముకుంటున్నాడు. ఫ్యాక్టరీ సమీపంలోనే వ్యాపారాలు అన్నీ మూతపడ్డాయి.

ఇంజనీరింగ్ చదవాల్సిన రాజారావు కొడుకు కోటగుమ్మం సెంటర్లో సైకిల్ షాప్ నడుపుతున్నాడు. రాజారావు భార్య సీతకు ఆపరేషన్ కాలేదు. ఆమె గవర్నమెంట్ హాస్పటల్‌కు వెళ్లి వస్తూనే ఉంది. అతని కూతురుకి ఇంకా పెళ్లి కాలేదు. రాజారావు లేనిఫ్యాక్టరీకి ఇప్పటికీ వెళ్లి వస్తూనే ఉన్నాడు... పట్టణానికి వచ్చిన ప్రతి రాజకీయ నాయకుడూ షుగర్ ఫ్యాక్టరీ గురించి మాట్లాడుతూనే ఉన్నాడు...

ప్రస్తుతం షుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణ స్థానిక నాయకుల ఎన్నికల వాగ్దానాల్లోకి తాజాగా చేరింది. ఫ్యాక్టరీ యాజమాన్యం మరో సిక్ ఫ్యాక్టరీని కొని ప్రారంభించింది. ఆ కార్యక్రమానికి పిఠాపురం ఎమ్మెల్యేతో పాటు ఛైర్మనూ, యూనియన్ నాయకులూ హాజరయ్యారు. మరో లాకౌట్ నాటకానికి తెర లేచింది. మరో 400 మంది కార్మికుల భవితకు సమాధి కట్టడానికి పునాదులు పడ్డాయి. ❊

'యాహూ'కు భయపడ్డ అందం 'సాయిరా బానూ'!

డా॥ జె.పి. వైద్య

"'వాటీజ్ సో గ్రేట్ అబౌట్ సాయిరా బానూ?' అని భృకుటి బిగించే ప్రశ్నలకు జవాబు ? 'నథింగ్'!

ఆమె మహా గొప్ప నటనా దురంధురాలేం కాదు!

మీనాకుమారి, వహీదా రెహమాన్, జయ బాధురి లాంటి గొప్ప నటి కాదు. హేమా, రేఖా, వైజయంతి మాల లాగా గొప్ప నాట్యకత్తెనా? కానే కాదు! మరి?

ఆమె గొప్పతనం?

'జంగ్లీ' సినిమాలో షమ్మీకపూర్ 'యాహూ'cc అని గావుకేక వేసినప్పుడు బెదిరిపోయి ధామ్మని మంచులో వెల్లకిలా పడిపోయింది ఎప్పుడో 1961లో! ఆ తరం వాళ్ళు ఆవిడతో పాటూ పడ్డారు. ఫ్యాన్స్ అయిపోయారు."

మనిషి మనస్సును అర్థం చేసుకోవడం మామూలు విషయం కాదు. 'మనస్సు' మహాశక్తివంతమైనది. స్వర్గాన్ని నరకంగానైనా, నరకాన్ని స్వర్గంగానైనా మార్చివేయగల అద్భుతశక్తులు మనిషి మనస్సుకే ఉన్నాయి. ఈ ప్రపంచంలో మన మనసంతా రివ్వున భూమి చుట్టు తిరిగినట్టే తిరిగి ఏ సినిమా పోస్టరులోనో, ఏ సినీ పత్రిక పేజీలోనో ఇరుక్కుపోయి, అక్కడే ఉండాలని మోరాయిస్తుంది. పెద్దోళ్ళ దృష్టిలో అందుకే మనం 'వేస్ట్‌గాళ్ళం'.

'చెప్తే వినక పోతివి.... ఇప్పుడు చూడు... సీన్మల పొంటి తిరిగి తమామ్ బైకారై పోయిండు. థూ...! అయినా, నిన్నని ఏం ఫాయిదా? గోడల మీద సీన్మ పోస్టర్లు అంటించే 'చావుష్' గాణ్ణి పట్టుకొని ఉతకాలే!

వాడే బర్బాద్ చేసి పారేశిండు పొలగాండ్లను...'

ఈ ఎవర్‌గ్రీన్ డైలాగ్ తరతరాలుగా వస్తున్నదే! అంతో ఇంతో మార్పులతో టీవీ బుల్లితెర యుగంలోనూ ఇవే డైలాగులు...! పట్టించుకోని తరం!

నేటికి దాదాపు 50 సంవత్సరాల క్రితం మన పెద్దోళ్ళను వాళ్ళ పెద్దోళ్ళు ఇలాంటి 'డైలాగులతోనే' దులిపారు. కథా కమామీషూ పాతదే!

మీకు షమ్‌షాద్ బేగం జ్ఞాపకం ఉందా?

ఓ.పి. నయ్యర్ 'ధూమ్ ధడాకా' పంజాబీ రేకాల పాటల జమానా అది! సి.ఐ.డి. ఫిల్మ్! హీరోయిన్ కోపంగా పెదాలు బిగించి విసవిసా నడచి పోతూ ఉంటుంది. హీరో ఇంకొకరి సాయంతో వెంటాడుతాడు. ఆ పాట నేటికీ అలనాటి తరాల వాళ్ళను వేటాడుతున్నది. వెంటాడుతున్నది.

'లేకే పహలా పహలా ప్యార్ - భర్ కీ ఆంఖోమే ఖుమార్ జాదూ నగరీ సే ఆయా-హై, కోయీ జాదూగర్'...!

అదే 'సి.ఐ.డి'లో మరో మత్తైన గీతం 'కహీఁపే నిగాహే.... కహీఁపే నిషానా' వ్యాంపిష్ పాత్రతో హిందీ సినీ రంగానికి పరిచయం అయిన 'మన తెలుగు పిల్ల' వహీదా రెహమాన్ మొదటి చిత్రం అది. పాటను గానం చేసినావిడ షమ్‌షాద్ బేగమ్.

'నయా అందాజ్'లో కిషోర్ కుమార్‌తో కలిసి పాడిన ఓ గీతం జ్ఞాపకం ఉందా? 'మేరి నీందోఁమే తుమ్.. మేరే ఖ్యా భోం మే తుమ్' అదీ చాలా పాపులర్ గీతం.

సి.ఐ.డిలో మరో గీతం- 'బూఝ్ మెరా క్యా నామ్ రే!!'.. ఇవన్నీ నేటికి సదా బహార్ గీతాలు. ఓ.పి. నయ్యర్ గాన సామ్రాజ్ఞి' లతా మంగేష్కర్‌తో ఒక్క పాట కూడా పాడించక తన సత్తా ఏమిటో చాటుకున్న మహా గొప్ప సంగీతకారుడు. ఆ పాటల మత్తు నేటికీ రసికులను వదలదు. ఆ షమ్‌షాద్ బేగం మనమరాలు... అంటే అలనాటి అందాల రాసి, సినీ నటి 'నసీమ్ బాను' అందాల ముద్దు బిడ్డ 'సాయిరా బాను' గురించి ఈ పూట ముచ్చటించుకుందాం.

'వాటీజ్ సో గ్రేట్ అబౌట్ సాయిరా బానూ?' అని భృకుటి బిగించే ప్రశ్నలకు జవాబు ? 'నథింగ్'!

ఆమె మహా గొప్ప నటనా దురంధురాలేం కాదు!

మీనాకుమారి, వహీదా రెహమాన్, జయ బాధురి లాంటి గొప్ప నటి కాదు. హేమా, రేఖా, వైజయంతి మాల లాగా గొప్ప నాట్యకత్తెనా? కానే కాదు! మరి?

ఆమె గొప్పతనం?

'జంగ్లీ' సినిమాలో షమ్మీకపూర్ 'యాహూ'cc అని గావుకేక వేసినప్పుడు బెదిరిపోయి ధామ్మని మంచులో వెల్లకిలా పడిపోయింది ఎప్పుడో 1961లో! ఆ తరం వాళ్ళు ఆవిడతో పాటూ పడ్డారు. ఫ్యాన్స్ అయిపోయారు.

ముస్లిం అమ్మాయిల్లో కన్పించే 'కమసీనియత్' నాజూకు తనం ఆవిడ ప్రత్యేకత. ముట్టుకుంటే కందిపోయే అందం. కాస్తంత చిలక ముక్కు. మాట్లాడితే రవ్వంత 'అనునాసికత' ఉండే సర్దీ గొంతు. హోల్ మొత్తం మీద గ్లామర్ డాల్! నటించిన ప్రతి సినిమాల్లో ఆమె ఒలికించిందంతా 'గ్లామరే'! 1944లో ఆగస్ట్ 23 నాడు జన్మించిన 'సాయిరా బానూ' ఇంట్లో అంతా సినిమాల వాతావరణమే!

తల్లి నసీమ్ బానూ సినిమాలో 1930-40 ప్రాంతంలో హీరోయిన్. ముత్తా షమ్‌షాద్' బేగమ్ ఎంతో గుర్తింపు పొందిన గాయని.

'లండన్'లో బాల్యం గడిపిన 'సాయిరా బానూ' మొదటిసారి 1961లో 'జంగ్లీ' సినిమాలో షమ్మీ కపూర్‌తో నటించింది.

ఆ రోజుల్లో ఓ నానుడి ఉండేది!

షమ్మీకపూర్‌తో మొదటి సారి నటించిన హీరోయిన్ హిందీ సినీ పరిశ్రమలో నిలదొక్కుకుంటుంది అని!

షమ్మీతో నటించిన హీరోయిన్లు ఏదో 'నామ్‌కే వాస్తే' కాకుండా హిందీ సినీ చరిత్రలోనూ నిలదొక్కుకున్నారు.

దానికి షమ్మీ 'రఫ్ అండ్ టఫ్' తత్వం మూల కారణం అనే 'వాదం'లో నేను తల దూర్చదల్చుకోలేదు. కాని - షమ్మీ -సాయిరాల తొలి సినిమా 'జంగ్లీ' సూపర్ డూపర్ హిట్! సంగీతం శంకర్ జై కిషన్‌లది! అప్పటికే వారికి 'సిల్వర్ జూబ్లీ' సంగీత దర్శకులనే పేరుంది. జంగ్లీలో గీతాలన్నీ చాలా ప్రసిద్ధి చెందాయి.

మొత్తం పాటలు ఎనిమిది. హస్రత్ జయపురీ రాసినవి ఐదు.

- కాశ్మీర్‌కి కలిహూఁ మై (లతా)
- ఎహెసాన్ తెరా హోగా ముఝుపర్ (రఫీ/లతా)
దిన్ సారా గుజారా తొరే అంగ్‌నా (రఫీ-లతా)
- నైన్ తుమ్హారే మజేదార్ ఓ జనాబే ఆలీ(ఆషా - ముకేష్)

శైలేంద్ర కలం నుండి జాలు వారిన గీతాలు ముచ్చటగా మూడు.

- జాజాజా మేరే బచ్‌పన్ (లతా)
- అయ్యయ్యా... కరూఁ మై క్యా సూకూ సూకూ (రఫీతో పాటు శంకర్ పాడాడు)

మూడవ గీతం ఆ సంవత్సరపు 'హిట్ గీతం' 'చాహె ముఝే కోయీ జంగ్లీ కహే' అంత కన్నా హిట్ 'యాహూ' అనే గావు కేక! ఆ కేక రఫీది కాదు. ప్రయాగ్ రాజ్ గారిది! ఆయన కూతురే ఈ తరం నటి అనీతా రాజ్! పాటలన్నీ సూపర్ డూపర్ హిట్స్!

హెచ్.ఎం.వీ వారికీ - దర్శకుడూ / నిర్మాత అయిన 'సుబోధ్ ముఖర్జీ'కి కాసులు రాసులు నింపి ఇచ్చింది 'జంగ్లీ'.

ఆ తర్వాత వచ్చిన సినిమాలు 'బ్లఫ్ మాస్టర్' (63)- ఆయి మిలన్‌కి తేరా' (64), 'ఏప్రిల్ ఫూల్' (64), 'ఎ జిందగీ కిత్నీ హసీన్‌హై' (66), ప్యార్ మొహబ్బత్ (66), 'షాగిర్ద్' '67) - దీవానా (67), అమన్ (67), పడోసన్(68)- ఝుక్ గయా ఆస్మాన్ (68) - ఆద్మీ ఔర్ ఇంసాన్ (69), సగీనా మహతో (70) - పూరబ్ ఔర్ పశ్చిమ్ (70)- గోపి (70) విక్టోరియా నెంబర్ 203 (73)- జ్వార్ భాటా (73) - సగీనా (74), రేషమ్ కీ డోరీ - (74), బైరాగ్ (76), దునియా (84), ఫైస్లా (88)

ఆయి మిలన్ కి బేలాలో పాటలు నేటికి సుమధుర గీతాలే!

- తుమ్హే ఔర్ క్యా దూ మై దిల్‌కే సివా (లతా)
తుమ్ కమసిన్ హో... నాదోఁ హో.... నాజుక్ హో.. భోలీహో (రఫీ/లతా)
- సనమ్ తెరే హో గయే హమ్ (రఫీ -లతా)
-టైటిల్ సాంగ్ (ఆషా - రఫీ)

ఎన్నిసార్లు విన్నా మళ్ళీ మళ్ళీ వినాలన్పించే గీతాలే అన్నీ!

నిర్మాత ఓం ప్రకాశ్ గారూ- దర్శకుడు మోహన్ కుమార్ గారూ, రాజేంద్ర కుమార్, సాయిరా, ధర్మేంద్ర, శశికళ అందరూ 'ఖుష్'!

మనమైతే ఓహో ! ఆహో! అంటూ పాగల్ అయిన వాళ్ళం!

'ఏప్రిల్ ఫూల్'లో నటన అంటే ఏమిటో తెలియని 'బిశ్వజీత్'గారు హీరోగిరీ వెలిగించినా పాటలు జాదై, సాయిరా గ్లామర్‌తో ఫిల్మ్ హిట్టైంది. లతా 'మెరా నామ్ రీటా క్రిస్టీనా' అని గానం చేసింది. సుమన్ కల్యాణపూర్-రఫీల రెండు యుగళ గీతాలు నేటికీ పసందుగా నిలిచిపోయాయి.

-'కహదోఁ జహాఁ సే కహదో
- తుఝే ప్యార్ కర్తేహై - కర్తే రహేంగే

'ఆ గలె లగ్ జా....' అనే రఫీ పాట కన్నా, టైటిల్ సాంగ్‌లో 'యూఁ షైతాన్' అంటూ అనునాసికంగా నాజుగ్గా చెయ్యెత్తి, కొట్టబోయే


భర్త దిలీప్ కుమార్‌తో....

'సాయిరా' అందరికీ వచ్చింది.

❖ ❖ ❖

'అమన్' అంతగా ఆడలేదు. కాని- 'ఆజకే రాత్ ఏకైసీ రాత్' పాడ్తూ రాజేంద్ర కుమార్ రొమాన్స్ చెయ్యబోతే 'మార్దుంగీ హాఁc' అని ఉత్తుత్తిగా కొట్టబోయే 'సాయిరా' నచ్చనిది ఎవరికనీ?

- 'ఇలాగే వచ్చి కొట్టు....' అని ఆ తరం దీవానాగాళ్ళు అనుకున్నారు. 'షాగిర్ద్' సాయిరా - జాయ్ ముఖర్జీల హిట్ చిత్రం. ఐ.ఎస్. జోహార్ అందులో అందించిన కామెడి-'బడెమియాఁ దీవానే'... నేటికీ చిరస్మరణీయం.

'దిల్ విల్ ప్యార్ వ్యార్ మై క్యా జానూ రే....' అంటూ మోకాళ్ల వరకు కట్టిన చీరతో యువకులకు వెర్రెత్తించింది. కాని, ఎందుకో మరి 22 సంవత్సరాల ప్రాయంలో తనకన్నా వయసులో సరిగ్గా రెట్టింపున్న హిందీ చిత్రగనరి 'ట్రాజెడి కింగ్' దిలీప్ కుమార్‌ను పరిణయమాడింది. వారిద్దరు కలిసి నటించిన 'బైరాగ్', 'గోపి-'సగీనా' లాంటి సినిమాలున్నాయి. నటనలో 'దిలీప్' ఎత్తు నందుకునే ప్రశ్నే ఉద్భవించదు. కాని, దిలీప్ మటుకు 'మరో పెళ్ళి' గోల అగాధంలో పడిపోయాడు.

ఆ తర్వాత ఇద్దరూ కుదురుగా, బుద్ధిమంతుల్లా 'ది లాంగెస్ట్ హ్యాపీ జోడీ' లా నేటికీ చిరునవ్వులు చిందిస్తున్నారు. సాయిరా బాను ఆ మధ్య టీవీ కోసం నిర్మాతగా వ్యవహరించి ప్రస్తుతం నటనకు దూరంగా ఉన్నారు.

'వివాహబంధం'లో చిరు తుఫాను సమసిపోయింది. దునియా (84) లో దిలీప్‌తో కామెడీ లాంటి పాత్రను నిభాయించినా- 'పూరబ్ ఔర్ పశ్చిమ్'లో 'వెస్టర్న్ హొయలు' ఒలికించినా- ఈ మధ్య వయస్సు వల్ల 'బొద్దుగా' కన్పిస్తున్నా-రసికుల మదిలో సాయిరా 'యాహూcc' గావుకేకకు ధామ్మని వెల్లకిలా మంచులో పడ్డ చలాకీ నాజూకు అమ్మాయి గానే ఉండి పోయింది. అందుకే ఎవరైనా ఉత్తుత్తి కోపంతో చేయి పైకెత్తి 'మారూంగీ హాఁc' అంటే 'యస్....యస్...' అని దెబ్బలు తినకండి! నా ప్రియమైన నేస్తాలూ!

దునియా సినిమా కాదు! అందరు 'సాయిరా'లు కారు!

మనలను 'సినిమా పిచ్చోళ్ళూ' అనీ-'జంగ్లీ' అనీ ముద్దుగా పిలిచే వారున్నంత కాలం ఎక్కడో ఓ చోట 'సాయిరా'లు పలకరించరంటారా?

❄



వీరి వీరి గుమ్మడి పండు
జవాబు

వీరి వీరి

గుమ్మడి

పండు

వీరి పేరు

కాజోల్

దీనిపై మీ స్పందనను రచయితకు తెలియచేయవచ్చు.
ఫోన్ : 08732223622

కథా నిలయం
శ్రీకాకుళం

అంగారకుని మీద నీరు, పోషక లవణాలు

ఎస్. వెంకట్రావు



ఇప్పుడు మనకు ఒక విషయం నిర్ధారణ అయింది. భూమ్మీదనే కాకుండా ఈ విశ్వంలో మనకు తెలిసిన మరో గ్రహం మీదకూడా నీరు ఉంది అని. అందువల్ల అంగారక గ్రహం భవిష్యత్తులో మానవుల నివాసానికి యోగ్యంగా ఉంటుందా లేదా అన్న దానికి ఒక సమాధానం దొరికింది. నీరు మానవ నివాసానికి చాలాచాలా అవసరం కదా. నీటితో బాటు అనేక పోషక లవణాలు కూడా ఉన్నాయన్న విషయం బోనస్ ఆవిష్కరణ అన్నమాట. అయితే ఇంకా అక్కడ జీవులు (ప్రాథమిక దశలో)గాని లేక గతంలో జీవులున్న ఆనవాలు తెలిపే కర్బన సమ్మేళనాలు గాని ఉన్నాయా లేదా అన్నదే తెలియాల్సి ఉంది.

మానవుడు దశాబ్దాలుగా కంటున్న కల ఫలించింది. అనేక సంవత్సరాలుగా అంగారక గ్రహంపై మానవాళి పెట్టుకున్న ఆశలు ఫలించాయి. భూమ్మీద కాకుండా మరో గ్రహం మీద ఉన్న నీటిని గురించి మానవుడు మొట్టమొదటిసారిగా పూర్తి ఆధారాలతో కనుగొన్నాడు....ఇదంతా జరిగింది గత మూడు నెలల్లో. శాస్త్రవేత్తలు అధికారికంగా ప్రకటించింది మాత్రం ఈ నెలారంభంలోనే.

అమెరికా అంతరిక్ష పరిశోధనా కేంద్రం 'నాసా' అంగారకునిపైకి పంపిన వ్యోమ నౌక 'ఫోనిక్స్' తొలిసారిగా గ్రహోపరితలం నుండి తీసిన మట్టిలో మంచు ఉన్నట్లు నిర్ధారించింది. అంతే కాదు మట్టితో బాటు జీవుల మనుగడకు అవసరమైన పోషక పదార్థాలను కూడా ఫోనిక్స్ కనుగొన్నదని ఫోనిక్స్ ప్రాజెక్టు శాస్త్రవేత్త పీటర్ స్మిత్ చెప్పారు. ఫోనిక్స్ వ్యోమనౌకకు అమర్చిన యాంత్రిక హస్తం అంగారకుని నేలను అరు సెంటీమీటర్ల లోతు తవ్వి తీసిన మట్టిలో "గడ్డకట్టిన నీరు ఉన్నట్లు చివరికి తేలింది" అని ఫోనిక్స్ ప్రాజెక్టుకు చెందిన మరో శాస్త్రవేత్త విలియం బోయ్‌టన్ జులై 30న చెప్పారు. "అంగారకునికి అనేక లక్షల మైళ్ల దూరంలో ఉన్న అక్కడి నీటిని మేం ఎట్టకేలకు తాకగలిగాం, రుచి చూడగలిగాం. గతంలో అలా జరగలేదు. ఆ నీటిని మేం రుచి చూడగలిగే హోదాలో నేను ఉండడం గొప్ప విషయం" అని బోయ్‌టన్ ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయి చెప్పారు. నీళ్లు మాత్రమే కాదు "మన శరీరాల్లో ఉండే, జీవులకు తప్పకుండా అవసరమయ్యే సోడియం, పొటాషియం, మెగ్నీషియం, క్లోరైడ్లు వగైరా కూడా అంగారక గ్రహంలో ఉన్నట్లు కనుగొన్నాం" అని పీటర్ స్మిత్ చెప్పాడు. అయితే అంగారకునిపై జీవంగాని, కర్బన సమ్మేళనాలుగాని ఉన్నట్లు ఇంకా కనుగొనలేదని ఆయన చెప్పాడు.

ఫోనిక్స్ పరిశోధన మానవాళి అంతరిక్ష పరిశోధనా చరిత్రలోనే ఒక గొప్ప ఆవిష్కరణగా చెప్పవచ్చు. భూమ్మీదలాగే ఈ విశ్వంలోని ఇతర నక్షత్ర మండలాల్లోని గ్రహాల్లో జీవం ఉండి ఉండవచ్చునన్నది శాస్త్రవేత్తల అంచనా. మన సౌర కుటుంబంలో జీవంగాని, దానికి ఆధారమైన నీరు, పోషక పదార్థాలు, వాతావరణం గాని ఉండేందుకు అవకాశం ఉన్న ఏకైక గ్రహం అంగారకుడు మాత్రమే. అందుకే అంగారకుని గురించి శాస్త్ర ప్రపంచంలోనూ, సామాన్య మానవుల్లోనూ కూడా అనేక ఆసక్తికరమైన అంశాలు చోటుచేసుకుంటూ వచ్చాయి. అంగారకుని గురించిన పరిశోధనలు ప్రాథమిక దశలో ఉన్నప్పుడే అక్కడ జీవం ఉన్నట్లూ, మనుషులకన్నా తెలివైన జీవులు అక్కడ నదులకు ఆనకట్టలు కట్టి పెద్ద ఎత్తున వ్యవసాయం చేస్తున్నట్లూ వదంతులు పుట్టుకొచ్చాయి. కాని పరిశోధన ముందుకు పోతున్న కొద్దీ అవన్నీ అభూత కల్పనలేనని తేలిపోయింది. చివరికి 1964లో అంగారకునికి అతి చేరువగా వెళ్లిన తొలి మానవ నిర్మిత వ్యోమ నౌక అమెరికాకు చెందిన 'మెరైనర్' అంగారకుని ఉపరితలానికి సంబంధించి 21 ఫోటోలను భూమికి పంపింది. వీటిని బట్టి అంగారకునిపై మనం ఊహించుకున్న వాతావరణం లేదని తేలిపోయింది. నీళ్లు, జీవజాలం జాడలు కనిపించలేదు. 1971లో తొలిసారి అంగారకునిపై దిగిన సోవియట్ వ్యోమనౌక 'మార్స్ 3' అక్కడ ద్రవరూపంలో నీటి జాడలు లేవని తేల్చేసింది. అయితే సోవియట్ నౌక అంగారకునిపై 20 సెకన్లు మాత్రమే పనిచేసి సమాచారం పంపింది. తరువాత 1975లో అమెరికా పంపిన వైకింగ్ నౌక అంగారకునిపై దిగి పూర్తిస్థాయి పరిశోధనలు జరిపింది. అది పంపిన ఫొటోల్లో కూడా అంగారక గ్రహం నిర్జీవమైన ఎడారి మాదిరి కనిపించింది. అయితే అంగారకుని ధృవాల వద్ద మంచు ఉంటుందనీ, అది బహుశా నేలలో కొంత లోతులో గడ్డకట్టి ఉంటుందని శాస్త్రవేత్తలు తదుపరి పరిశోధనల వల్ల నిర్ధారణకు వచ్చారు. ఈ నీటిలో ఇప్పుడుగాని, లేక గతంలో గాని జీవం ఉండవచ్చునని కూడా వారు అనుమానించారు. వారి అనుమానాలు నిజం చేస్తూ 2001లో అంగారకుని చుట్టూ పరిభ్రమించిన 'మార్స్ ఒడిస్సే' వ్యోమ నౌక అక్కడ ధృవాల్లో నీటి జాడను కనిపెట్టింది. అది పంపిన హై రిజల్యూషన్ చిత్రాలు విశ్లేషించిన శాస్త్రవేత్తలు ఆ ఫొటోల్లో కనిపించిన ప్రాంతంలో ఒక

వ్యోమనౌకను దించేందుకు పథకం వేశారు. ఫోనిక్స్ ప్రయోగంతో అది విజయవంతమైంది.

అంగారకునిపైకి ఇప్పటివరకు 12 వ్యోమనౌకలను పంపగా ఆరు విఫలమైనాయి, ఆరు జయప్రదంగా గ్రహంపై దిగాయి. వాటిలో సరికొత్త నౌక ఫోనిక్స్. నాసా 2007 ఆగస్టు నాల్గవ తేదీన ఈ వ్యోమనౌకను ప్రయోగించింది. ఇది రోదశిలో తొమ్మిది మాసాలు ప్రయాణించి 2008 మే 25న అంగారకుని ఉత్తర ధృవంలో నేలమీద దిగింది. దాని కెమెరాలు ఉపరితలం మీద తెల్లని పదార్థాన్ని ఫొటో తీశాయి. అవి ఉదయం తీసిన ఫోటోలు. తరువాత తీసిన ఫొటోల్లో ఈ తెల్లని పదార్థం అదృశ్యమైంది. అంటే అక్కడ గడ్డకట్టిన మంచు ఉన్నట్లు శాస్త్రవేత్తలు జూన్ నెలలోనే నిర్ధారణకు వచ్చారు. అయితే వాస్తవంగా ఫోనిక్స్ మంచును 'చేతో' తీసి తన 'వీపు' మీద అమర్చిన పరిశోధనా శాలలో విశ్లేషించి చూస్తేనే గాని ఆ విషయం పూర్తిగా నిర్ధారణ కాదనీ చెప్పారు. అంగారకునిపై మట్టిని అరడుగు లోతు తవ్వి నమూనాలు తీసింది ఫోనిక్స్ కృత్రిమ హస్తం. దాని కోసం శాస్త్రవేత్తలు చాలా సార్లు ప్రయత్నించాల్సి వచ్చింది. ఎందుకంటే అక్కడ మంచుతో కలిసిన మట్టి గట్టిగా ఉంది. నిజానికి ఫోనిక్స్ దిగిన ప్రాంతంలో అరడుగు లోతులో నీరు గడ్డకట్టి మంచురూపంలో ఉందని అంతకు ముందే శాస్త్రవేత్తలకు తెలుసు. అంటే ఫోనిక్స్ ఉత్తర ధృవంలోని మంచుపొరపై దిగిందన్న మాట. అనేక సంవత్సరాలుగా మంచుపై పేరుకున్న మట్టిని తవ్వి మంచును బయటకు తీయడమే సమస్య. ఫోనిక్స్ శాస్త్రవేత్తలు ఆ పనిని జయప్రదంగా చేయగలిగారు.

ఇప్పుడు మనకు ఒక విషయం నిర్ధారణ అయింది. భూమ్మీదనే కాకుండా ఈ విశ్వంలో మనకు తెలిసిన మరో గ్రహం మీదకూడా నీరు ఉంది అని. అందువల్ల అంగారక గ్రహం భవిష్యత్తులో మానవుల నివాసానికి యోగ్యంగా ఉంటుందా లేదా అన్న దానికి ఒక సమాధానం దొరికింది. నీరు మానవ నివాసానికి చాలాచాలా అవసరం కదా. నీటితో బాటు అనేక పోషక లవణాలు కూడా ఉన్నాయన్న విషయం బోనస్ ఆవిష్కరణ అన్నమాట. అయితే ఇంకా అక్కడ జీవులు (ప్రాథమిక దశలో)గాని లేక గతంలో జీవులున్న ఆనవాలు తెలిపే కర్బన సమ్మేళనాలు గాని ఉన్నాయా లేదా అన్నదే తెలియాల్సి ఉంది. ఫోనిక్స్ ఇకపై చేసే పరిశోధన అంతా దాని చుట్టూనే తిరుగుతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. మూడు మాసాల పరిశోధన కోసం అంగారకునిపైకి పంపిన ఫోనిక్స్ ఆరోగ్యం చాలా చక్కగా ఉండడంతో దానితో మరో నెల ఎక్కువ పనిచేయించాలన్న నిర్ణయానికి శాస్త్రవేత్తలు వచ్చారు. మామూలుగా అయితే ఆగస్టు చివరికి ఫోనిక్స్ పరిశోధనలు అంతం కావాలి. కాని సెప్టెంబర్ చివరి వరకు దానిచేత పరిశోధనలు చేయించాలని నాసా నిర్ణయించింది. దీనికోసం నిధులు కూడా విడుదల చేసింది. సెప్టెంబర్ తరువాత ఫోనిక్స్‌లోని పరికరాలు పనిచేయడం సాధ్యం కాదు. అందులోని ఇంధనం సరిపోకపోవడం ఒక్కటే కాదు, సెప్టెంబర్ చివరికి ప్రవేశించే అంగారక శీతాకాలం వ్యోమనౌకలోని పరికరాలను చలితో బిగదీసేస్తుంది. కాని ఈ లోగా అక్కడ జీవజాడల గురించి ఫోనిక్స్ కనిపెడుతుందేమో ఎదురుచూద్దాం. ❄



నాన్న ఉద్యోగం నాకు రావాలంటే...

మా నాన్నగారు (షేక్ మహబూబ్) వినుకొండ రైల్వేస్టేషన్‌లో కేర్‌టేకర్‌గా పని చేసేవారు. 1999వ సంవత్సరం, అక్టోబర్ 13న (13-10-1999న) చనిపోయారు. ఆయనకు మొదటి భార్య వల్ల సంతానం కలగలేదు. 15 సంవత్సరాల తర్వాత మా అమ్మగారిని (షేక్ బషీరున్) రెండవ వివాహం చేసుకున్నారు. రిటైర్‌మెంటు సదుపాయాలు, పెన్షన్, ఒంగోలు జిల్లా కోర్టు వారు తీర్పులో ఫ్యామిలీ పెన్షన్ ఇద్దరికీ చెందేటట్లుగా ఆర్థిక వనరులు నాకు, మా తమ్ముడికి, మా చెల్లెలికీ చెందే విధంగా తీర్పు ఇచ్చారు. మా నాన్నగారి మొదటి భార్యకు పిల్లలు లేరు.

మాకు కంపాషనేట్ ఎంప్లాయిమెంట్ ఇవ్వవలసినదిగా విజయవాడ రైల్వే డిపార్టుమెంటు వారిని కోరాము. మా తమ్ముడికి మైనార్టీ తీరనందున ఆ ఉద్యోగ అర్హత వచ్చేవరకు ఆగమన్నారు. మేము మా తమ్ముడికి బదులుగా పెద్ద అన్నైన నాకు ఉద్యోగం ఇప్పించవలసిందిగా రైల్వే శాఖ వారికి దరఖాస్తు చేసుకొన్నాము. తేది 13-6-2008న వెళ్ళి కలిశాము. వారు మొదటి భార్యకు, ఆమె పిల్లలకు తప్ప, రెండవ భార్యకు గాని, ఆమె పిల్లలకు గాని ఉద్యోగం ఇచ్చే అవకాశం లేదన్నారు. కావున నిరుపేదలమైన మాకు ఏ ఆధారం లేనందున మాకు రైల్వేలో ఉద్యోగం వచ్చే విధంగా మీరు మాకు తగిన సలహా ఇవ్వగలరు.

షేక్ రషీదా, సత్తెనపల్లి, గుంటూరు.

మీ కేసుకు సంబంధించి ఫ్యామిలీ కోర్టులో తీర్పు వచ్చింది. దాంట్లో మిమ్మల్ని వారసులుగా గుర్తించి మీకు వాటాల పంపిణీ జరిగింది. కావున మీ నాన్నగారి వారసులుగా సర్వహక్కులుంటాయి. ప్రభుత్వ ఉద్యోగికి రెండవ వివాహం చెల్లదు. కాని. మీ పెద్దమ్మకు ఉద్యోగం కోసం వయస్సు దాటిపోయి ఉంటుంది. కావున మీకుటుంబ సభ్యలందరి అంగీకారంతో ఆ ఉద్యోగం మీరు పొందవచ్చు. మీ పెద్దమ్మగారి అంగీకారం కూడా ఉంటే మంచిది. లేదన్నా పిల్లలుగా మీరు ఉద్యోగం పొందవచ్చు. రైల్వే అధికార్లకు అర్జీ పెట్టుకోండి. కారుణ్య నియామకం 'హక్కు'గా మాత్రం రాదు. మానవతా దృక్పథంతో మాత్రమే ఇవ్వడం జరుగుతుంది. వారు ఇవ్వనప్పుడు కోర్టును ఆశ్రయించవలసిందే.



జి. ఎల్. నరసింహారావు

హైకోర్టు న్యాయవాది, 9848994240

కథా నిలయం

హాస్యం... మానవ విలువలు నిండిన కథలు

పద్మభూషణ్ డా॥ బోయి భీమన్న గారి శ్రీమతి హైమవతి గార్కి ఈ కథల సంపుటిని రచయిత్రి అంకితం ఇచ్చారు. సంగీతంలో, చిత్రకళలో, ఫోటోగ్రఫీ, కార్టూన్లలో రచయిత్రికి మంచి ప్రవేశం, పట్టు ఉన్నాయి. ఈ ఫోటోలు నాటి ఆంధ్ర పత్రిక, ఉదయం దినపత్రికల నుండి నేటి హాస్యానందం, మయూరి, మల్లెతీగ విశ్వరచనల్లో ప్రచురితమై - పాఠకుల్ని ఆకర్షించాయి. ఇక ఈ కథల సంపుటిలో దాదాపు 30 కథల దాకా వున్నాయి. ఆంధ్రజ్యోతి, ఆంధ్రప్రభ, న్యూజెర్సీ కథల పోటీల్లో బహుమతి అందుకున్న కథ, ఉదయం (ఆదివారం) పత్రిక, మయూరి వీక్లీ, వనితా జ్యోతి, సుప్రభాతం, వార్త, లాంటి పత్రికల్లో ప్రచురణ అయిన కథలు, వివిధ సందర్భాలలో పోటీల్లో బహు'మతు'లు గెల్చుకున్న కథలను రచయిత్రి ఈ సంపుటిగా తీసుకొచ్చారు.

శిల్పం మోతాదు కొంచెం తక్కువగా అనిపించినా, వస్తు ప్రాధాన్యత, సునిశిత హాస్యం, వ్యంగ్యం, మానవతా విలువలు కథల్లో బలంగా కనిపిస్తాయి. చాలా చోట్ల ఆంగ్ల పదాలు అగుపిస్తాయి. ఉదా॥ డాషింగ్ నేచర్" (పేజీ127), గర్ల్‌ఫ్రెండ్స్, ఎయిర్ పోర్ట్....బ్యాంక్ (పేజీ 133) డిస్టర్బ్ (పేజీ 134), ప్రముఖ రైటర్ (పేజీ 134) ఇలా చాలా పదాలు కనిపిస్తాయి. కథల్లో కథనంలో తెలుగుతనం- తెలుగు పలుకుబడులు కనిపించాలి. మధ్యతరగతి మానవ కుటుంబ నేపథ్యంగానే చాలా కథలు సాగాయి. భర్త పెట్టే వేధింపులు... సాధింపులు, పురుషాధిక్యత బలంగా చూపించిన "అగ్ని సాక్షిగా" (కథ) ఆలోచింపచేస్తుంది. "పెండింగ్ ఫైళ్ళ క్లియరెన్స్ వీక్" కథ ప్రభుత్వ కార్యాలయాల్లోని నిర్లక్ష్య మనస్తత్వాలు, లంచం పడనిదే ఫైలు కదపని ఉద్యోగుల ఆలోచనలు... 'నారా' వారి పాలనలో జరిగిన జన్మభూమి కార్యక్రమాలు, ఆఫీసుల తనిఖీలు.... ఆకస్మికంగా వెళ్ళి అధికార్లపై చర్యలు గైకొనే స్థితిని కళ్ళ ముందు ఉంచుతుంది.

మామయ్య చేతిలో మోసపోయిన 'లలిత' కథ పాత భావనలతోనే సాగింది. ముగింపు బలంగా ఉండాలి. అతివలు... అబలలు కారు. ఆదిశక్తిగా నిలబడి పోరాడాలి అనే దిశగా 'కథ' ముగింపు ఇస్తే బాగుండేది...."బొమ్మా బొరుసు" కథలో కూడా పురుషుడి చేతిలో మోసపోయే స్త్రీగా (భార్యా భర్తల జీవితాన్ని) బృహతి పాత్రను రచయిత్రి వాస్తవికతకు దగ్గరగా మలిచారు. "పబ్లిక్ అకౌంట్స్ కమిటీ" కథ చాలా బాగుంది. (పేజీ 27) బహుళార్థ సాధక ప్రాజెక్టు పనుల్లో అవినీతి, అక్రమాలు యథేచ్ఛగా సాగిపోతుంటే ఇటువంటి కంటితుడుపు పబ్లిక్ అకౌంట్స్ కమిటీలేం చేస్తాయి?" అని అవినీతిని ప్రశ్నించే రచయిత్రి కలాన్ని అభినందించాలి.

"శ్రీగిరి రాజు కథలు"
రచన: శ్రీమతి శ్రీగిరిరాజు విజయలక్ష్మి
పేజీలు: 156, వెల: 51/-రూ
సెల్: 9246571113.

- తంగిరాల చక్రవర్తి

ధ్వంసరచన

నాటిక
వల్లూరు శివప్రసాద్
వెల:15/-
పేజీలు:34
ప్రతులకు:
విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్,
అబిడ్స్, సుల్తాన్ బజార్, హైదరాబాద్.

జాణపదులు



తొలకరి ప్రచురణలు
కవి. బో.పా.ర
వెల:40/-,
పేజీలు: 33
ప్రతులకు:
బొల్లు పాండురంగం,
ఇ.నెం.1-7-496/1/5/జి
ముషీరాబాద్,
హైదరాబాద్.

వాఙ్మయి

డా॥ ఎండ్లూరి సుధాకర్ రావు

వెల: 50/-,
పేజీలు: 157
ప్రతులకు:
పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం,
హైదరాబాద్.
అన్ని పుస్తక షాపులలో.

వ్యాస మందిరం

రచయిత
కె. రామ్మోహన్ రావు
వెల: 50/-,
పేజీలు: 53
ప్రతులకు:
విశ్వసాహితి,
1-3-1-18,
కవాడిగూడ,
సికింద్రాబాద్.
విశాలాంధ్ర, నవోదయ పుస్తక షాపులలో.





సూట్‌కేస్‌లో కారు

"వాట్! సూట్‌కేస్‌లో కారా! ఛాన్సే లేదు" అన్నట్టు ఆ చూపేంటి బాస్. మేం చెప్తోంది నిజమే. అబద్ధమనుకుంటే ఫొటోలు చూడండి. ఆ కుర్రోడు చకచకా సూట్‌కేస్ తెచ్చాడు. టకటకా అన్ని భాగాలూ తీశాడు. బిగించేశాడు. కారు రెడీ అయిపోయింది. కాలర్ ఎత్తుకుని మరీ సూట్‌కేస్ కారులో షికారు మొదలెట్టేశాడు. ఇంతకీ ఈ సూట్‌కేస్ కారు కనిపెట్టిన మేధావి ఎవరనేగా మీ డౌటు. అదొక్కటి అడక్కండి. ఏదో నెట్‌సముద్రంలో పడి వెతుకుతూ వుంటే ఫొటోలు మాత్రం కనిపించాయి. వాటినే మీకు కూడా చూపిస్తే బావుంటుందనిపించింది. చూపించేశాం. ఓపిక వుంటే గింటే మీరూ ఇలాంటి ప్రయోగాలు చేసేయొచ్చు.



కథా నిలయం
శ్రీకాకుళం

కలం స్నేహం

హాయ్ చిన్నారి నేస్తాలూ!

మీక్కూడా వీళ్లలాగా కలంస్నేహం చెయ్యాలని ఉందా? మరి ఆలస్యం ఎందుకు? ఒక పోస్ట్‌కార్డు తీసుకొని మీ పేరు, వయసు, తరగతి, స్కూలు, హాబీలు, చిరునామా రాయండి. ఆ తర్వాత మీ కలర్‌ఫోటోను అతికించి పోస్ట్ చెయ్యండి. అంతే ఎంచక్కా ప్రచురిస్తాం. అన్నట్టు, ఈ పుస్తకాన్ని మీ స్నేహితులకూ చూపించి అన్ని విషయాలు చెప్పండి. వాళ్లకు కూడా కలం స్నేహం చెయ్యాలని వుంటే కార్డు మీద రాసి మాకు పంపమనండే. మరి మా అడ్రస్ కలంస్నేహం, బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం. 1, అశోక్‌నగర్, హైదరాబాద్.

పేరు: చలువాది రవితేజ
చదువు: 10వ తరగతి
వయస్సు: 15 సం॥
స్కూలు: బి.వి. సుబ్బయ్య హైస్కూల్
లక్ష్యం: ఇంజనీర్ కావడం
హాబీలు: పుస్తకాలు చదవడం, టీవీ చూడడం, ఆటలు ఆడడం
చిరునామా: సిహెచ్. రవితేజ, సన్నాఫ్: రమేష్, చీమకుర్తి, ప్రకాశం.

పేరు: ఎం. శరత్‌చంద్ర
చదువు: 10వ తరగతి
వయస్సు: 15 సం॥
స్కూలు: జెడ్.పి.ఎస్.ఎస్.
లక్ష్యం: ఇంజనీర్ కావడం
హాబీలు: పుస్తకాలు చదవడం, క్యారమ్స్, చెస్ ఆడడం
చిరునామా: ఎం. శరత్‌చంద్ర, సన్నాఫ్: రవీందర్, అపోజిట్ కమలాహెవెన్స్, జ్యోతినగర్, కరీంనగర్.

పేరు: బి. అఖిల
చదువు: 7వ తరగతి
వయస్సు: 11సం॥
స్కూలు: శివప్ప హై స్కూల్
లక్ష్యం: డాక్టర్ కావడం
హాబీలు: పుస్తకాలు చదవడం, టీవీ చూడడం
చిరునామా: బి. అఖిల, డాటరాఫ్: బి. శ్రీనివాస్ రెడ్డి, ప్రశాంత్‌నగర్, ఇసిఐఎల్, హైదరాబాద్.

పేరు: టి. భవ్యశ్రీ
చదువు: యు.కె.జి
వయస్సు: 5సం॥
స్కూలు: లేసియం స్కూల్
లక్ష్యం: డాక్టర్ కావడం
హాబీలు: పుస్తకాలు చదవడం, టీవీ చూడడం, ఆటలు ఆడడం
చిరునామా: టి. భవ్యశ్రీ, సన్నాఫ్: పవన్‌కుమార్, బాలాపూర్, మిధాని, హైదరాబాద్.

పేరు: రాహుల్ శ్రీ
చదువు: ఎల్.కె.జి
వయస్సు: 5 సం॥
స్కూలు: శ్రీ చైతన్య విద్యాలయం
లక్ష్యం: ఎస్సై కావడం
హాబీలు: క్రికెట్ ఆడడం, టీవీ చూడడం,
చిరునామా: రాహుల్ శ్రీ, సన్నాఫ్: వెంకటయ్య, కొత్ర, వెల్దండ, మహబూబ్‌నగర్.

పేరు: జె. పోతులూరి చారి
చదువు: 9వ తరగతి
వయస్సు: 14సం॥
స్కూలు: జిల్లా పరిషత్ హై స్కూల్, నూతన్‌కల్
లక్ష్యం: ఇంజనీర్ కావడం
హాబీలు: పుస్తకాలు చదవడం, ఆడడం, పాటలు పాడడం
చిరునామా: జె. పోతులూరి చారి, సన్నాఫ్: సత్యనారాయణ, నూతన్‌కల్, నల్గొండ.